


# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల-పెద్దపల్లి-అసిఫాబాద్-మంచిర్యాల

ఆదివారం | 21 | జూన్ | 2026 | పేజీలు 13 | www.manamepaper.com


## ఎవరు ఎన్ని చిల్లర ఆరోపణలు చేసిన పట్టించుకోబోం

### అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రతి పేదోడి కళ్ళల్లో ఆనందం చూసే విధంగా పనిచేస్తాం

### రాష్ట్రమంత్రి డి.శ్రీధర్ బాబు

**మంథని జూన్20 (మనం న్యూస్) :** ఎన్ని చిల్లర ఆరోపణలు చేసిన తాము పట్టించుకోబోమని అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రతి పేదోడి కళ్ళలో ఆనందం చూసే విధంగా పనిచేస్తామని రాష్ట్ర ఐటి,పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల.శ్రీధర్ బాబు అన్నారు. శనివారం మంథని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి శ్రీధర్ బాబు లబ్ధిదారులకు అందజేశారు. పెద్దపల్లి జిల్లాలోని మంథని, ముత్తారం,రామగిరి, కమాన్ పూర్,పాలకుర్తి ఇతర మండలాలకు సంబంధించిన సీఎంఆర్ఎఫ్ 64 చెక్కులకు గాను21 లక్షల41వేల100 రూపాయలు మంజూరయ్యాయి. అనంతరం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పరిపాలనలో..

2లో..

# దసరా నాటికి కరీంనగర్ - వరంగల్ హైవే పనులు పూర్తి

### మోదీ పాలనలో రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



2

ఈ ఏడాది విజయ దశమి నాటికి కరీంనగర్ -వరంగల్ జాతీయ రహదారి పనుల నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. కరీంనగర్ -వరంగల్ హైవే విస్తరణ పనులు పూర్తయ్యిన వెంటనే కరీంనగర్ -- జగిత్యాల హైవే విస్తరణ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికే ఈ హైవే విస్తరణకు సంబంధించి టెండర్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు.

హుజురాబాద్, జూన్ 20 (మనం న్యూస్)

# పేదల సంక్షేమంకు నిరంతర కృషి

### ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్



2లో..

**పేదల సంక్షేమంకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని గుడేటి రెడ్డి సంఘంలో శనివారం 40మందికి సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 12 లక్షల 60 వేల రూపాయల విలువ గల చెక్కులను,17 మంది ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మీ, షాది ముభారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అందజేశారు.**

**రాయికల్, జూన్ 20(మనం న్యూస్) :** తాట్లవాయి గ్రామంలో 33 లక్షల నిధులతో,భూపతి పూర్ గ్రామంలో 15 లక్షలతో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసారు..అనంతరం మైతాపూర్, కిష్టంపేట, ఉప్పుమడుగు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులతో పేదలకు ఆర్థిక భరోసా కలుగుతుందని అన్నారు.

# కిసాన్ సమ్మాన్ నిధితో రైతుల ఆదాయం పెరిగింది

**రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడమే మోదీ సర్కార్ లక్ష్యం...**

**వ్యవసాయ బడ్జెట్ ను 5 రెట్లు పెంచిన ఘనత మోదీ సర్కార్ దే...**

**ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలను అందించండి...**

**మోదీ సర్కార్ కు మద్దతిచ్చి ఆశీర్వదించండి...**

**కేంద్ర మంత్రి బండి సంజయ్...**



జమ్మికుంట, జూన్ 20 (మనం న్యూస్): కిసాన్ సమ్మాన్ నిధి లబ్దిదారుల్లో 92 శాతం మంది రైతులు ఆ సొమ్మును సద్వినియోగం చేసుకుంటున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. తద్వారా రైతుల ఆదాయం పెరుగుతోందన్నారు. గ్యారంటీ లేని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాడుకునే పాలకులు ఉన్న నేటి రోజుల్లో అందుకు భిన్నంగా గత ఏడేళ్లుగా క్రమం తప్పకుండా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పైసలను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న ఘనత నరేంద్రమోదీ ప్రభుత్వానిదేనని చెప్పారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట కేవీకేలో శనివారం నిర్వహించిన 23వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి విడుదల కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా కిసాన్ సమ్మాన్ నిధిని రైతుల ఖాతాల్లో జమ చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగాన్ని వం-ఛ్చువల్ ద్వారా తిలకించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ... గ్యారంటీ లేని పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాడుకునే పాలకులు ఉన్న నేటి రోజుల్లో అందుకు భిన్నంగా గత ఏడేళ్లుగా క్రమం తప్పకుండా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పైసలను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్న ఘనత నరేంద్రమోదీ ప్రభుత్వానిదేనని అన్నారు. 2019 ఫిబ్రవరి నుండి నేటి వరకు రైతుల ఖాతాల్లో రూ.5 లక్షల కోట్లకుపైగా జమ చేశారని, ఒక్క విడత కూడా లేట్ చేయలేదని, దేశవ్యాప్తంగా 9 కోట్ల 44 లక్షల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. ఇయాళ 23వ విడత కింద .... 18 వేల 880 కోట్లు నిధులు విడుదలయ్యాయి. నీతి అయోగ్ లెక్కల అధ్యయనం ప్రకారం సకాలంలో ఈ పైసలను రిలీజ్ చేయడంవల్ల 92 శాతం మంది రైతులు కిసాన్ సమ్మాన్ పైసలను వ్యవసాయ అవసరాలకు అంటే... విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయడానికి ఖర్చు చేస్తున్నారని తేలింది. 85 శాతం మంది రైతులు తమ వ్యవసాయ ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. నిజానికి ఇంతకంటే ఏం కావాలి? రైతులకు ఇస్తున్న పైసలు తక్కువే కావొచ్చు... కాని కేంద్రం తనకున్న ఆర్థిక పరిమితుల మేరకు ఇస్తున్న సొమ్ము 92 శాతం వినియోగం అవుతుందంటే... ఇంతకంటే ఇంకేం కావాలని అన్నారు. 2014తో పోలిస్తే వ్యవసాయ బడ్జెట్ ను ఏకంగా 5 రెట్లు పెంచారు. 11 లక్షల కోట్ల రూపాయలతో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని ఏర్పాటు చేశారు. ఈ ఏడాది బడ్జెట్ లో వ్యవసాయం, రైతుల సంక్షేమానికి 1 లక్షా 40 వేల 529 కోట్ల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే 5 శాతం కేటాయింపులు పెంచామని, కేంద్ర బడ్జెట్ 2026-27లో పీఎం కిసాన్ కోసమే 60 వేల కోట్ల రూపాయలు కేటాయించారంటే అర్థం చేసుకోవాలని అన్నారు. 25 కోట్ల మందికి భూసార పరీక్షల కార్డులను అందించారని, రైతుల రుణ పరిమితిని ఈ ఏడాది నుండి 5 లక్షల రూపాయలకు పెంచినట్లు చెప్పారు. పీఎం ఫసల్ బీమా యోజన కింద బీమా కంపెనీల ద్వారా 1 లక్షా 75 వేల కోట్ల పరిహారాన్ని అందించారని, 7 కోట్ల 70 లక్షల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందించి 10 లక్షల కోట్ల రూపాయల క్రెడిట్ మద్దతు కల్పించారని గుర్తు చేశారు. రైతు లక్ష రూపాయల లోన్ తీసుకుంటే... ఏడాదికి వడ్డీతో కలిపి 1 లక్షా 4 వేల చెల్లిస్తే చాలు. మన తెలంగాణలోనూ దాదాపు 40 లక్షల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులిచ్చి దాదాపు 50 వేల కోట్ల రుణాలను అందించగలిగాం. అంటే విత్తనాలు, ఎరువులు మొదలు వ్యవసాయ యంత్రాలు, పశుసంవర్ధక, పాడి, చేపల పెంపకం దాకా అవసరమైనప్పుడు ఈ కార్డును ఉపయోగించి రుణాలు పొందవచ్చు. ముఖ్యంగా రైతులకు కనీస మద్దతు ధరను యూపీఏ పాలనతో పోలిస్తే దాదాపు రెట్టింపు చేశారని అన్నారు. 25 కోట్ల మంది రైతులకు సాయి-ల్ హెల్త్ కార్డులు ఇచ్చారని, మన తెలంగాణలో 1 కోటి 10 లక్షల సాయిల్ హెల్త్ కార్డులు అందించారని అన్నారు. ఎరువుల సబ్సిడీ గురించి చెప్పాల్సిన పని లేదని బహిరంగ మార్కెట్లో యూరియా బస్తా ధర 2400 నుండి 2700 దాకా ఉంటే సబ్సిడీపై 266 రూపాయలకే అందిస్తున్నారని అన్నారు. యూరియా, డీఏపీ, పొటాషియం ఏటా ఒక్కో ఎకరానికి 18 వేల రూపాయలను రైతుకు ఆదా చేస్తున్నారని, ఒక్క ఎరువుల సబ్సీడీ పేరుతోనే మోదీ ప్రభుత్వం 12 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. ఎరువుల వాడకంతో పండించిన ఆహార ధాన్యాలను తింటున్న ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, ఎరువుల వాడకంతో పంట దిగుబడి పెరగడం ద్వారా వచ్చిన ఆదాయాన్ని మళ్లీ రోగాల పేరుతో ఆసుపత్రుల ఖర్చులకే పోతున్నాయనే విషయాన్ని గుర్తించాలని అన్నారు. ఇకపై ప్రజల శ్రేయస్సు ద్రుష్ట్యా ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు రైతులంతా ప్రక్రుతి వ్యవసాయంవైపు మళ్లాలని, ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లితే తొలి పంట ఆదాయం రాకపోయినా, ఆ తరువాత వేసే పంటలన్నీ లాభదాయకంగా మారతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు.

# ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా మురికి కాలువల పరిశుభ్రత



తాండూర్ జూన్ 20 (మనం న్యూస్) : తాండూర్ మండలం కాసిపేట గ్రామపంచాయతీ పరిధిలోని చంద్రపల్లి గ్రామంలో శనివారం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముధం వనజ, ఉపసర్పంచ్ బోయిని సుమలత ఆధ్వర్యంలో గ్రామంలోని మురికి కాలువలను శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే గ్రామాభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో గ్రామపంచాయతీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ కంబాల తిరుపతి, సాలిగామ సంతోష్ తదితరులు పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎవరు ఎన్ని చిల్లర ఆరోపణలు చేసిన పట్టించుకోబోం

మొదటి పేజీ తరువాయి

సింగరేణిని కాపాడింది అప్పుడున్న కాంగ్రెస్ పార్టీ అని ఆయన గుర్తు చేశారు. అల్లిబిల్లి మాటలతో ఒక పార్టీ తర్వాత ఇంకొక పార్టీ ప్రభుత్వంలో ఉండి టిఆర్ఎస్ పార్టీకి సంబంధించి ఆ కుటుంబంతో విభేదాలతో ఆ కుటుంబం నుంచి బయటికి వచ్చి మాపై చిల్లర ఆరోపణలు చేస్తూ మమ్మల్ని ఏదో చేస్తామంటే ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎవరు ఏం చేయలేరని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తెలిపారు. గంగాపురిలో మహిళలకు సంబంధించిన కుట్టు మిషన్ కర్మగారాన్ని రాబోయే రెండు మూడు నెలల్లో పూర్తి చేసి,అనేకమంది మహిళలకు ఉపాధి కల్పిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. మంథనిలో రోడ్లు వెడల్పు చేసి వీధి దీపాలు డివైడర్లు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దడం జరిగింద ని,రోడ్డు వెడల్పులో గాని వెడల్పులో స్థలాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం వారికి అండగా ఉండి వారికి ఆదాయం వచ్చే విధంగా మరో కాడ వెసులుబాటు కల్పిస్తామని తెలిపారు. కూరగాయల మార్కెట్, నాన్ వెజ్ మార్కెట్ తాత్కాలికంగా వాగు గడ్డ రోడ్డుపైన ఏర్పాటు చేయడం జరిగిందని, రాబోయే కొద్ది రోజులలో అధునాతనమైన మార్కెట్ను పూర్తి చేసి వారికి మళ్ళీ తిరిగి కేటాయిస్తామని, ఎవరు అధైర్య పడద్దని అందరికీ అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మంథని పట్టణంలో అత్యధికంగా ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వడం జరిగిందని, రాబోయే రోజులలో ఇంకా వెయ్యి ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నామని , మంథని నియోజకవర్గానికి రెండో విడత ఇందిరమ్మ ఇల్లులు త్వరలో ఇవ్వబోతున్నామని ప్రతి పేదోడికి పక్కా ఇల్లు నిర్మిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. అత్యధిక ధాన్యం ప్రభుత్వం సేకరించడం జరిగిందని,ఒక్క గింజ కూడా తాలు తప్ప పేరుతో కట్ చేయకుండా,రైతులకు ఖాతాలో డబ్బులు చెల్లించామని శ్రీధర్ బాబు తెలిపారు. ఎవరో చిల్లర ఆరోపణలు చేస్తే వాటిని పట్టించుకోమని అభివృద్ధి సంక్షేవ-ంమే లక్ష్యంగా పనిచేస్తూ ప్రతి పేదోడి కళ్ళల్లో ఆనందం చూడడమే మా ధ్యేయంగా పనిచేస్తామని శ్రీధర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్,వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, కౌన్సిలర్స్,ప్రజాప్రతినిధులు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,జిల్లా నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దసరా నాటికి కరీంనగర్ - వరంగల్ హైవే పనులు పూర్తి

మొదటి పేజీ తరువాయి

జమ్మికుంట నుండి తిరిగివస్తూ కందుగుల చౌరస్తా వద్ద కరీంనగర్ -- వరంగల్ హైవే జాతీయ రహదారి పనులను శనివారం సాయంత్రం పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, బీజేపీ స్థానిక నేతలు సైతం కేంద్ర మంత్రి వెంట ఉన్నారు. కేంద్ర మంత్రి రోడ్డు విస్తరణ పనుల పరిశీలనకు వస్తున్నారని సమాచారం అందుకున్న ఎన్ హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, ఉన్నతాధికారులు కందుగల వచ్చారు. కేంద్ర మంత్రిని కలిసి జాతీయ రహదారి విస్తరణ పనుల పురోగతిని వివరించారు. కొత్తగట్టు, బొమ్మకల్, గట్టు దుద్దెనపల్లి వంటి చోట్ల కొన్ని పనులు పెండింగ్ లో ఉన్నాయని, అవి మినహా 90 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మరో మూడు నెలల్లో విస్తరణ పనులను పూర్తి చేస్తామన్నారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణంతోపాటు గ్రామీణ, మండల, జిల్లా స్థాయిలోనూ రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. రోడ్లు బాగుంటేనే రవాణా సౌకర్యాలు మెరుగుపడి గ్రామాలు, పట్టణాలు, మండలాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అందులో భాగంగా ఏటా రహదారుల నిర్మాణానికి రూ.3 లక్షల కోట్లను మోదీ ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. కరీంనగర్ వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అక్కడక్కడ కొన్ని న్యాయపరమైన సమస్యలు తలెత్తినప్పటికీ వాటిని అధిగమించి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ హైవే పనులు పూర్తయ్యిన వెంటనే కరీంనగర్ -జగిత్యాల రోడ్డ విస్తరణ పనులను ప్రారంభిస్తామన్నారు.

# పేదల సంక్షేమంకు నిరంతర కృషి

మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు ఆకుల మల్లేశం,తలారి నాగరాణి,గుర్రం భావన,ఆత్మ చైర్మెన్ కాటిపెళ్ళి గంగారెడ్డి, కౌన్సిలర్ గంగాధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, నాయకులు రవీందర్ రావు ద, కోల శ్రీనివాస్, సురేందర్ నాయక్,తంగెల్లా రమేష్,కో ఆప్షన్ సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి.. రైతన్నలకు శాపం..!

**చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

**రైతు పండించిన ప్రతి ధాన్యం గింజ కొనాల్సిందే**

**తక్షణమే రైతుబంధు వేయాలి. రైతు భీమా కోసం ప్రీమియం చెల్లించాలి**

**రైతు వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించు కోవాలి**



గంగాధర, జూన్ 20, ( మనం న్యూస్ ) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో అన్నదాతల పరిస్థితి ఆగమాగం అయిందని చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర మండలం మధురానగర్ లో స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మే-రకు రాష్ట్ర వ్యాప్తంగా రైతు వ్యతిరేక విధానాలపై నిరసనలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఇటీవల కేంద్రం కేటాయించిన కోటా మేరకే పంటలను కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు. ఎన్నికల ముందు చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు మాట మార్చడం రైతులను మోసం చేయడమేనని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతే కేంద్రబిందువుగా పాలన సాగిందని, 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు భీమా, మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి పథకాలతో తెలంగాణ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని చెప్పారు. రైతుల ఖాతాల్లో వేల కోట్ల రూపాయలు నేరుగా జమ చేసి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. ప్రస్తుతం రైతుబంధు సక్రమంగా అమలు కాకపోవడం, రైతు భీమా నిలిచిపోవడం, రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం, ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత సీజన్‌లో కూడా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అనేక ఇబ్బందులు పడాల్సి వచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ రైతులను దిక్కులేనివారిగా మార్చాయని విమర్శించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను మోసం చేసే ప్రభుత్వాలను ప్రజలు క్షమించరని అన్నారు. రైతులు పండించే ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, ఎన్నికల హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని లేనిపక్షంలో రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హెచ్చరించారు. ఆయన వెంట చొప్పదండి నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

# గంగాధర మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో రూపాదేవికి ఘన నివాళి



గంగాధర, జూన్ 20, ( మనం న్యూస్ ) : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి 2వ వర్ధంతిని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గంగాధర ప్రజా కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రూపాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం గంగాధర మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న 260 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షల్లో జిల్లాపరిషత్ పాఠశాలలో చదివి మండల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు మొదటి టాపర్ కురిక్యాల గ్రామానికి చెందిన కె.శ్రీజ రూ. 6 వేలు,రెండవ టాపర్ బూరుగుపల్లి గ్రామానికి చెందిన బి.సంజనకు రూ. 4 వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంత్రి మహేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పని చేసిన రూపాదేవి అందరికి నాణ్యమైన విద్య అందాలని కోరుకునేదని, ఆమె ఆశయాలకు అనుగుణంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నియోజకవర్గంలో విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తయారు చేయడంలో తన మార్క్ చూపిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దుబ్బాసి బుచ్చయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షులు ముద్దం నగేష్, మాజీ జెడ్పిటిసి సత్తు కనకయ్య, సర్పంచులు వేముల భాస్కర్, రేండ్ల శ్రీనివాస్, బీర్ల ఆనంద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, సర్పంచులు బాస వేణి శ్రీనివాస్, లింగాల లింగయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు పడాల రాజన్న, రాచమల్ల భాస్కర్, సంపత్, రేండ్ల రాజిరెడ్డి, దూలం వీరేశం, మేర్గ కొండయ్య, గుజ్జుల బాపురెడ్డి, కోలేపాక స్వామి, ఆరె రాజశేఖర్, ప్రవీణ్ రెడ్డి, కడారి కనకయ్య, చిందం ఆంజనేయులు, దానే ఓదెలు, దాతు అంజి, పెంచాల చందు,ముచ్చె శంకరయ్య, కొలపురి లక్ష్మణ్, తాళ్ల శ్రీనివాస్, తాళ్ల సురేష్, ప్రేమ్, శ్రీకాంత్, తోట సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో యువ కార్మికుడు మృతి

కాసిపేట, జూన్ 20(మనంన్యూస్)మందమర్రి ఏరియా కాసిపేట 1వ గని సేఫ్టీ డిపార్ట్మెంట్ లో విధులు నిర్వహిస్తున్న కుంభం రాజు (సుమారు 28 సం )అనే యువ కార్మికుడు మృతి చెందారు. శుక్రవారం తన బైక్ పై గోదావరిఖని నుండి రామకృష్ణాపూర్ లో నివాసానికి వస్తున్న క్రమంలో మేకల వ్యాన్ ఢీకొన్న సంఘటనలో రాజు తలకు తీవ్ర గాయాలైనట్టు తోటి కార్మికులు తెలియచేశారు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో పరిస్థితి విషమించి శనివారం రాజు మ-రణించినట్టు వారు స్పష్టం చేశారు. గని కార్మిక సంఘాల నాయకులు, తోటి కార్మికులు రాజు మరణం చెందడం పట్ల విచారం వ్యక్తం చేశారు.

# ఆశ్రమ పాఠశాలకు సబ్ కలెక్టర్



కాసిపేట, జూన్ 20(మనంన్యూస్)కాసిపేట మండలం రేగులగూడ, గిరిజన ఆశ్రమ పాఠశాలను శనివారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదులు, ఇతర పాఠ్యం అభివృద్ధి పనుల పురోగతి ని పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, గడువు లోగ పూర్తి అయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం తరగతి గదులు, స్టోర్ లో స్టాక్ రూమ్, రికార్డ్ లు, మధ్యాహ్నం భోజనం తీరు తెన్నులు, విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, తదితర అంశాలను బోధన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఉప సర్పంచ్ కొడప అనంత రావు, పాఠశాల లోని పలు సమస్యలు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకు పోయారు. వాటి పరిష్కారం కోసం నిధులు మంజూరు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ సునీల్ దేశ్ పాండే, రెవెన్యూ ఇన్స్పెక్టర్ స్వేతా రెడ్డి, పాఠశాల హెచ్ ఎమ్ లక్ష్మి, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు



రామగిరి,జూన్ 20 (మనం న్యూస్): కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు తయారయ్యాయని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఏకరూప దుస్తులను, ఉచిత పాఠ్యపుస్తకాల ను పంపిణీ చేశారు. 180 మంది విద్యార్థులు పాఠశాలలో చదువుతున్నారని ఆమె తెలిపారు. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు సర్పంచ్ విద్యాభ్యాసం చేయించారు. హెచ్ఎం బుర్రి శ్యామ్, ఉపాధ్యాయులు కనకం స్వామి, ఏ మురళి, కే. రాజమౌళి, తిరుపతి, శ్రీకాంత్, ఓదెలు, లక్ష్మణ్, లావణ్య, రవళి లు పాల్గొన్నారు.

# మరణించిన జీవిస్తున్న బింగి శ్యామల



బెల్లంపల్లి, జూన్ 20,(మనం న్యూస్) : శ్రీరాంపూర్, అరునక్క నగర్ నివాసులు బింగి శ్యామల వయస్సు 64 సంవత్సరాలు అనారోగ్యంతో మరణించగా జనహిత సేవా సమితి సభ్యులు డోలి సుకుమార్ వారి కుటుంబ సభ్యులకు నేత్రదానం గురించి వివరించగా పుట్టెడు దుఃఖంలో ఉండి నేత్రదానం ద్వారా ఇద్దరు జీవితాల్లో వెలుగులు నింపాలని భావించి నేత్రదానం చేయడానికి ముందుకు రావడంతో ఎల్ వి ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషన్ ప్రదీప్ నేత్రదానం లో భాగంగా కార్నియా స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ బింగి శ్యామల మృతి బాధాకరమని కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో ఉన్న వారి కుటుంబ సభ్యులు భర్త బింగి సత్యం, కుమారులు బింగి శ్రీనివాస్, రవీందర్ కుమార్తె శైలజ , కోడళ్ళు అల్లుడు మనుమలు మనుమరాండ్లు, కుటుంబ సభ్యులు నేత్ర దానం ద్వారా ఇద్దరి అందులకి చూపునివ్వాలని నేత్ర దానానికి ముందుకు రావడం అభినందనీయం అని జనహిత సేవా సమితి ద్వారా ఇది 22 వ నేత్రధాన కార్యక్రమం అని వారి స్ఫూర్తితో ప్రజలందరు మరణించిన తరువాత నేత్ర, అవ-యవ,శరీరాలు కాల్చి బూడిద అయి వృధా కాకుండా దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని నేత్రదానం చేసినపుడు మరణించిన తరువాత ఎనిమిది గంటల లోపు మరణించిన వ్యక్తి యొక్క కంటి భాగం లోని కార్నియా పొరని మాత్రమే సేకరిస్తారని నేత్ర దానం ద్వారా ఇద్దరు అందులకి చూపు ప్రసాదించి వారి ద్వారా మరణించిన ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో అవ-యవాలు అవసరం ఉన్న ఆరుగురి ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని అలాగే శరీర దానం ద్వారా పార్థివ దేహాన్ని వైద్య కళాశాల కి అందించి కొన్ని వేల మంది వైద్య విద్యార్థుల బోధనకు ఉపయోగపడి ప్రజల వైద్య చికిత్స కి ఉపయోగపడే అవకాశం ఉందని ప్రజలందరూ అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేత్రదానం అనంతరం కుటుంబ సభ్యులకు ఎల్.వి ప్రసాద్ ఐ బ్యాంక్ వారి నేత్ర దాన సర్టిఫికెట్ ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బింగి రాజేంద్రప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కేసుల సత్వర పరిష్కారానికే లోక్ అదాలత్‌లు



(మంథని జూన్20 మనం న్యూస్) కోర్టు కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ లు ఎంతగానో తోడ్పడతాయని మంథని జూనియర్ సివిల్ జడ్జి ఆర్. సుధారాణి అన్నారు. శనివారం మంథని కోర్టులో ప్రయోగ దినోత్సవం లోక్ అదాలత్ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టు కేసుల్లో రాజీమార్గాల ద్వారా ఇరువర్గాలకు న్యాయం చేకూరుతుందన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారం అవుతాయన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో యోగ శిక్షణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ న్యాయమూర్తి అనురాధ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెవిఎల్ ఎన్ హరిబాబు ఏపీపీ అర్థ కుమార్ మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ బుద్దే.స్వామి, న్యాయవాదులు రగోతమ్మ రెడ్డి,సువర్ణ చంద్రశేఖర్,లోకే రాధా కిషన్,కటకం శ్రీనివాస్, డి విజయ్ కుమార్, యు.సుభాష్, శశిభూషణ్ కాచే, షబానా,కోర్టుసిబ్బంది పాల్గొన్నారు.


# గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై అవగాహన సదస్సు



మంథని జూన్20 (మనం న్యూస్) గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై డివిజనల్ లెవెల్ ఎంపీడీవో శ్రీజ రెడ్డి అధ్యక్షతన సర్పంచులు,మంథని మండల గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు, పాలకవర్గ సభ్యులకు, వివిధ శాఖల అధికారులకు, సూరయ్యపల్లి రైతు వేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం నుండి శేఖర్ హాజరై గ్రామపంచాయతీలలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై పలు అంశాలను వివరించారు. పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు,పాలకవర్గ సభ్యులు,సంబంధిత అధికారులు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని ఎంపీడీవో శ్రీజారెడ్డి, ఎంపీవో,సిడిపిఓ, మండల వైద్యాధికారి, మండల విద్యాధికారి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, సూరయ్యపల్లి గ్రామ సర్పంచ్ ఆర్ల నాగరాజు,మంథని మండలసర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు,పలు శాఖల అధికారులుపాల్గొన్నారు.

# దాహంతో అల్లాడి... పైప్‌లైన్‌నే ట్యాప్ చేసిన కోతి

మల్యాల, జూన్ 20,( మనం న్యూస్ ) : వేసవి తాపానికి తట్టుకోలేక ఓ కోతి నీటి కోసం ఏకంగా ఇంటి వాటర్ ట్యాంక్ పైప్‌లైన్‌నే ఆశ్రయించింది. మండల కేంద్రంలోని ఓ ఇంటి పైకి ఎక్కిన కోతి, వాటర్ ట్యాంక్ నుంచి వస్తున్న పైప్ నుంచి నేరుగా నోటితో నీళ్లు తాగుతూ కనిపించింది. ప్రస్తుతం భానుడి భగభగలతో అడవుల్లో నీటి చెలమలు, కుంటలు అడుగంటిపోయాయి. దీంతో దాహంతో అల్లాడుతున్న కోతులు ఆహారం, నీటి కోసం జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇళ్లపై ఉన్న వాటర్ ట్యాంకులు, కుళాయిలే వాటికి దిక్కవుతున్నాయి. “ఈ మధ్య కోతుల బెడద ఎక్కువైంది. గుంపులు గుంపులుగా వచ్చి ఇంట్లోకి దూరి సామాన్లు పాడు చేస్తున్నాయి. నీళ్ల కోసం పైపులు, ట్యాంకుల మూతలు కూడా విరగొడుతున్నాయి” అని స్థానికులు వాపోయారు. అటవీ శాఖ అధికారులు స్పందించి అడవిలో నీటి తొట్లు, సాసర్లు ఏర్పాటు చేయాలని, లేకుంటే వేసవిలో ఈ సమస్య మరింత తీవ్రమవుతుందని గ్రామస్తులు కోరుతున్నారు.



# నీట్ రీ-పరీక్ష కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు

**-రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా.**

మంచిర్యాల కల్చరల్, జూన్ 20,(మనం న్యూస్) : నీట్ రీ-పరీక్ష నేపథ్యంలో, రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో ఉన్న పరీక్ష కేంద్రాల వద్ద శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా భారతీయ నాగరిక భద్రతా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 (పూర్వపు సెక్షన్ 144) ప్రకారం నిషేధాజ్ఞలను అమలు చేస్తూ రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు 21-06-2026 ఆదివారం ఉదయం 6.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు అమలులో ఉంటాయని,వాటిని ఎవరైనా ఉల్లంఘించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. మంచిర్యాల జోన్‌లోని మొత్తం ఐదు పరీక్ష కేంద్రాలు,అవి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మంచిర్యాలలో ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదని, సభలు,సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడం నిషేధించబడిందని పేర్కొన్నారు. అదేవిధంగా, పరీక్ష కేంద్రాలకు 500 మీటర్ల పరిధిలో ఉన్న అన్ని జిరాక్స్ కేంద్రాలను 21-06-2026 ఉదయం 6.00 గంటల నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

# అధిక సాంద్రత పత్తి సాగులో న్యూమాటిక్ ప్లాంటర్‌తో విత్తనాల విత్తకం ప్రదర్శన



బెల్లంపల్లి, జూన్ 20, (మనం న్యూస్ ) : మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన రైతు మొగిలి పొలంలో శనివారం అధిక సాంద్రత పత్తి సాగులో న్యూమాటిక్ ప్లాంటర్ ద్వారా పత్తి విత్తనాల విత్తకం ప్రదర్శనను కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) బెల్లంపల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే బెల్లంపల్లి పంట ఉత్పత్తి శాస్త్రవేత్త డా. ఎన్. మహేష్ రైతులకు అధిక సాంద్రత పత్తి సాగు యొక్క ప్రాముఖ్యత, ప్రయోజనాలను వివరించారు. ఈ విధానంలో సరైన మొక్కల సాంద్రత, నీరు మరియు ఎరువుల సమర్థ వినియోగం, కలుపు నివారణ సౌలభ్యం, అధిక దిగుబడులు సాధించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ కూలీల కొరత తీవ్రంగా ఉన్నందున యాంత్రీకరణను ప్రోత్సహించాల్సిన అవసరం ఉ ందన్నారు.న్యూమాటిక్ ప్లాంటర్ ద్వారా ఒక ఎకరం విస్తీర్ణంలో విత్తనాల విత్తకం కేవలం 50 నిమిషాల్లో పూర్తవుతుందని, దీంతో సమయం, శ్రమ మరియు వ్యయం గణనీయంగా తగ్గుతాయని వివరించారు. ఈ యంత్రం ద్వారా విత్తనాలు సమాన దూరంలో, సరైన లోతులో పడటంతో మొక్కలు ఎదుగుదల ఏకరీతిగా ఉండి మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. అలాగే అధిక సాంద్రత పత్తి సాగుకు అనుకూలమైన హైబ్రిడ్లు, వరుసల మధ్య మరియు మొక్కల మధ్య పాటించాల్సిన దూరం, సమతుల్య ఎరువుల వినియోగం, నేల సారాన్ని మెరుగుపరచే చర్యలు, సమగ్ర పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. సమతుల్య ఎరువుల వినియోగం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడి స్థిరమైన పత్తి ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్, జాన్ డీర్ కంపెనీ ప్రతినిధులు, కేవీకే సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించాలి



బెల్లంపల్లి, జూన్ 20, (మనం న్యూస్) : బెల్లంపల్లి పట్టణం, మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తూ, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్న కేవలం ధనార్జనే ధ్యేయంగా విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా విద్యాసంస్థల యాజమాన్యాలకు వత్తాసు పలుకుతుందని బి ఆర్ ఎస్ వి జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ అన్నారు. వీటిపై మండల విద్యాధికారికి శనివారం వినతి పత్రం అందజేసి మాట్లాడారు. అధిక ఫీజుల వసూలుకు నియంత్రణ కోసం కమిటీ వేస్తామని ప్రభుత్వం చెప్పి ఇప్పటివరకు కమిటీ వేయకపోవడం, కార్పొరేట్ వ్యవస్థకు అజ్యం పోస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని కాల్ టెక్స్ ఏరియాలో ఒక పాత ప్రైవేట్ పాఠశాల కొనుగోలు చేసి ఆ పాఠశాలను పాత పేరుతో (దేవి పబ్లిక్ స్కూల్ ) నడపకుండా తవక్కల్ విద్యాసంస్థ గా పేరు మార్చి నడుపుతూ విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్న తవక్కల్ పాఠశాలను వెంటనే సీజ్ చేయాలని లేని పక్షంలో బి ఆర్ఎ స్ వి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యోగం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ వి పట్టణ అధ్యక్షుడు ఆడెపు అరుణ్, ప్రధాన కార్యదర్శి బుద్దార్థి సుమంత్, కార్యదర్శి వడ్డేపల్లి నితీష్, నాయకులు బడికెల ప్రణీత్, ఎనగందుల సాయి కృష్ణ, గడ్డం శివ, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయండి

**-బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు**

**దాసరి ఉష**



పెద్దపల్లి,జూన్ 20(మనం ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న తీరు అత్యంత దారుణమని,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు భిన్నంగా వ్యవహరిస్తూ అన్నదాతలను నిలువునా మోసం చేస్తోందని బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు దాసరి ఉష తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.శనివారం జిల్లా కేంద్రంలోని వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దాసరి ఉష మాట్లాడుతూ రాష్ట్రంలోని వ్యవసాయ పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తప్పుబట్టారు.ఎన్నికలకు ముందు చివరి గింజ వరకు కొంటామని, అన్ని పంటలకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని ఊదరగొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం,నేడు అధికారంలోకి వచ్చాక మాట మార్చిందని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వం ఎంత పంటను కొంటుందో,అంతే కొంటామని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఆమె విమర్శించారు.ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి,ఇప్పుడు కేవలం కొన్ని రకాల పంటలకు మాత్రమే పరిమితం కావడం రైతులను తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవైపు యూరియా బస్తాల కోసం రైతులు చెప్పులు పెట్టి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి నెలకొందని,తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత పంజాబ్‌ను మించే స్థాయిలో వరిని పండించిన మన రైతన్నలు, ఇప్పుడు మళ్లీ సమైక్య పాలననాటి ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆమె గుర్తు చేశారు.ఆనాడు అన్ని పంటలకు బోనస్ అని చెప్పి,ఇప్పుడు నిబంధనల పేరుతో రైతులను మోసం చేయడం ఏంటని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో వ్యవసాయ విస్తీర్ణం పెరిగినప్పటికీ,దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.రైతుల పొట్ట కొట్టేలా రాజకీయాలు చేయడం మానుకోవాలని, రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని,లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ తరపున పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చరించారు.సమావేశంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు,చిన్నకల్వల మాజీ ఎంపీటీసీ సంపత్,ఓదెల మండల నాయకులు బీరం రవి,రాంపల్లి వార్డ్ సభ్యులు శ్రవణ్,నర్సయ్య,కనగర్తి గ్రామ వైస్ ప్రెసిడెంట్ సదయ్య,నాయకులు దోది అశోక్, మల్లేష్,మహేందర్,అబ్దుల్ మాలిక్,అవినాష్,అంజయ్య,వంశీ,శ్రీను,హరికృష్ణ,సింగసాని అనిల్,సంతోష్,చందు,సాయి చరణ్,పుల్లూరి అవినాష్,రైతు ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# లైన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బచ్చు వంశీకృష్ణ




వేములవాడ,జూన్ 20(మనం న్యూస్):సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలోని వేములవాడ లైన్స్ క్లబ్ అధ్యక్షునిగా బచ్చు వంశీకృష్ణను నియమించారు. పట్టణంలోని మున్నూరు కాపు భవనంలో జరిగిన లైన్స్ క్లబ్ సమావేశంలో బచ్చు వంశీకృష్ణను లైన్స్ క్లబ్ అధ్యక్షునిగా సీనియర్ లయన్ అనంతుల శివప్రసాద్ ప్రకటించారు. వంశీకృష్ణ తో పాటునూతన తో పాటు ప్రధాన కార్యదర్శిగా కొమ్మ నటరాజ్, కోశాధికారిగా డాక్టర్ వినయ్ లను నియమించినట్లు ఆయన ప్రకటించారు. వీరితోపాటు 14 మంది డైరెక్టర్లను సైతం నియమిస్తూ ప్రకటన జారీ చేశారు. అనంతరం నియమితులైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన బచ్చు వంశీకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో లైన్స్ క్లబ్ అధ్యక్షునిగా నియామకానికి సహకరించిన లైన్స్ క్లబ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులందరినీ ఏకతాటిపై తీసుకువచ్చి లైన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృత పరుస్తామన్నారు. ప్రజలకు లైన్స్ క్లబ్ సేవలను విరివిగా అందించేందుకు కృషి చేస్తానన్నారు. పర్యావరణ రక్షణ కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. క్లబ్బు సభ్యత్వం పెంచేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ అధ్యక్షులు డాక్టర్ చీకటి సంతోష్ కుమార్, తీగల వెంకటేశ్వరరావు,రాపెల్లి శ్రీధర్, మారం కుమార్, డాక్టర్ ఆనంద్ రెడ్డి, నగుబోతు రవీందర్, రాజేందర్, మోటూరి శ్రీనివాస్, జమీల్ అహ్మద్ లతోపాటు సీనియర్ జర్నలిస్టులు, న్యాయవాదులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# వాహనదారులు హెల్మెట్ ధరించాలి



కాసిపేట, జూన్ 20(మనంన్యూస్)ద్విచక్ర వాహనాలపై విధులకు రాకపోకలు చేసే కార్మికులు తలకు తప్పకుండా హెల్మెట్ ధరించాలని కాసిపేట గ్రూప్ ఏజెంట్ ఖదీర్ అన్నారు. శనివారం మందమర్రి ఏరియా కాసిపేట 2గని పై ఏర్పాటు చేసిన సమావేశం లో రోడ్డు భద్రత, నిబంధనల పై కార్మికులకు ఏజెంట్ అవగాహన కల్పించారు.వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, రోడ్డు భద్రత పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. వ్యక్తిగత నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాలను నివారించేందుకు భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. గని మేనేజర్ బారపాటి రమేష్ మాట్లాడుతూ ఇంటి వద్ద నుండి డ్యూటీ కి వేగిర పాటు లేకుండా ఇంకా కొంత ముందు బయలుదేరాలి అని ఉద్యోగులను కోరడం జరిగినది. ఉద్యోగులు, తమ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశం లోగని రక్షణ అధికారి రవి శంకర్ వత్స, గుర్తింపు సంగం నాయకుడు గోళ్ల శ్రీనివాస్, గని అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

# అటవీ సంరక్షణకు సీడ్ బాల్స్.. పచ్చదన పెంపుకు వినూత్న కార్యక్రమం



నెన్నెల, జూన్ 20 (మనం న్యూస్): అటవీ విస్తీర్ణం పెంపు, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా నెన్నెల మండల అటవీ ప్రాంతంలో శనివారం సీడ్ బాల్స్ పంపిణీ మరియు చల్లే కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో మాలగురజాల గ్రామానికి చెందిన రత్నం శ్రీనివాస్, సంయుక్తంగా సుమారు 2 వేల సీడ్ బాల్స్‌ను స్వయంగా తయారు చేసి అటవీ ప్రాంతంలోని ఖాళీ ప్రదేశాల్లో విస్తరించారు. వర్షాకాలానికి ముందే సీడ్ బాల్స్‌ను అటవీ ప్రాంతంలో చల్లడం ద్వారా వర్షాలు కురిసిన అనంతరం అవి మొలకెత్తి చెట్లుగా పెరిగి పచ్చదనాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అటవీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అడవుల విస్తీర్ణం పెరగడంతో పాటు జీవ వైవిధ్య పరిరక్షణకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, ప్రకృతి పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న రత్నం శ్రీనివాస్‌ను అభినందిస్తూ అటవీ శాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

# పుస్తకాల వ్యాపారం చేస్తున్నా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి




వేములవాడ జూన్ 20 (మనం న్యూస్):భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వేములవాడ కమిటీ ఆధ్వర్యంలో పుస్తకాల వ్యాపారం చేస్తున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేసి, ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల ఫీజులు నియంత్రించాలని , ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలనీ విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ వేములవాడ పట్టణం లో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠ్యపుస్తకాలు అమ్మడం విచ్చలవిడిగా పెరిగాయని అడ్డు అదుపు లేకుండా ఇష్టానుసారంగా అమ్ముతూ ఫీజులు పెంచుతూన్నారని వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే యూనిఫాం, టై , బెల్ట్, బ్యాగ్ సైతం విద్యార్థులకు అమ్ముతూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని వారి గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఒక నర్సరీ విద్యార్థి దగ్గర పదిహేను ఇరవై వేల రూపాయలు మరియు పదవ తరగతి విద్యార్థుల వద్ద నలభై వేల నుండి యాభై వేల వరకు వసూళ్లు చేస్తున్నారని ఇలా ఉండటం ద్వారా విద్య అనేది పేద వారికి అందని ద్రాక్ష లాగా మారిందని వారు వాపోయారు, వాటిని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు కదరి శివ నాయకులు శివాజీ , రాము, భరత్, అభినయ్, అఖిల్ , ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడిని జయించే అద్భుత సాధనం

## యోగా




సుల్తానాబాద్, జూన్ 20 (మనం న్యూస్) యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు ఒత్తిడిని జయించే అద్భుత సాధనమని సుల్తానాబాద్

ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం పాఠశాలలో ఘనంగా యోగ డే వేడుకలు నిర్వహించారు. యోగా శిక్షకులు, పీఈటీల ఆధ్వర్యంలో విద్యార్థులతో సూర్య నమస్కారాలు, పద్మాసనం, చక్రాసనం, భుజంగాసనం, హలాసనం తదితర యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ యోగా ద్వారా శరీర దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని వివరించారు. విద్యార్థులు ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు సత్యం, సతీష్, జ్యోతి, మేనేజర్ శివ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్య పెంచాలి

దండేపల్లి జూన్ 20 (మనం న్యూస్) : 2026-27 విద్య సంవత్సరానికి గాను బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు నమోదు సంఖ్య గణనీయంగా పెంచాలని మండల విద్యాధికారి మంత్రి రాజు అన్నారు. ఐదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆరవ తరగతిలో ఏ విధంగా నమోదు చేయించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు లో ఆయన మాట్లాడారు. ఈ విద్య సంవత్సరానికి గాను ప్రతి పాఠశాలలో కనీసం 10 శాతం మంది విద్యార్థులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని వారినీ ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలలు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు ఉన్నాయని విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని విద్యార్థులు తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని చేయించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులచే విద్య బోధన జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దండేపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సంఘర్స్ రాజేశ్వరరావు, మామిడిపల్లి ప్రధానోపాధ్యాయులు నరేందర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, మండలంలోని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# రాజీ మార్గమే రాజమార్గం




కోరుట్ల జూన్ 20 (మనం న్యూస్) : ఆరేళ్లుగా తండ్రి కొడుకుల మధ్య న్యాయస్థానంలో కొనసాగుతున్న భూ వివాదం ఎట్టకేలకు లోక్ అదాలత్ వేదికగా సమసిపోయింది. తల్లిదండ్రుల పోషణ భారం, వైద్యఖర్చులు, బాగోగులకు చూసుకోవడమే కాకుండా తోడ బుట్టిన సోదరికి తండ్రి నుంచి పొందిన స్థిరాస్తి నుంచి 4 గుంటల స్థలం రిజిస్ట్రేషన్ చేసుటకు, రూ. 6.50 లక్షలు ఇచ్చేందుకు అంగీకరించడంతో తండ్రి కొడుకుల నడుమ నెలకొన్న ఆరేళ్ల పంచాయతీకి తెరదించారు. రాజీ మార్గంలో తండ్రి, కొడుకుల నడుమ సయోధ్య కుదర్చడంలో న్యాయవాదులు తీసుకున్న చొరవ పట్ల ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. పూర్వపరాలిలా ఉన్నాయి. మనెగూడం పట్టణానికి చెందిన ఆర్మూర్ మానాల భీమయ్యకు కొడుకు ఆర్మూర్ భీమయ్య, కూతురు లత ఉన్నారు. తండ్రి మానాల భీమయ్య తన పేరిట ఉన్న 3 ఎకరాల 30 గుంటల భూమిని గత కొన్ని సంవత్సరాల క్రితం కొడుకు భీమయ్యకు సేల్డీడ్ రిజిస్ట్రేషన్ చేశారు. కాగా ఆ సమయంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం తల్లిదండ్రుల పోషణలో భాగంగా నెలవారీ పోషణ భత్యం, వైద్యఖర్చులు కొడుకు పెట్టుకోవాలి. కానీ కొంత కాలం తర్వాత ఆ ఒప్పందం ఉల్లంఘించడటంతో తండ్రి మానాల భీమయ్య ఆ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ను రద్దు చేసి తన పేరిట మార్చిడి కోసం కోర్టును ఆశ్రయించాడు. దాదాపు ఆరు సంవత్సరాలుగా (ఓ.ఎస్ నెం. 112/2020) కేసు కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నడుస్తున్నది. ఈ నెల 20న లోక్ అదాలత్ ఉన్న నేపథ్యంలో ఇటీవల జూనియర్ సివిల్ జడ్జి కే పావని బార్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రాజీమార్గంలో కేసుల పరిష్కారంలో న్యాయవాదులు తమవంతు కృషి చేయాలని సూచించారు. ఈ క్రమంలో వాది అయిన మానాల భీమయ్య తరపున న్యాయవాది భీమనాతి రఘు, ప్రతివాది అయిన ఆర్మూర్ భీమయ్య తరపున న్యాయవాది బోయిని సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకుని తండ్రి, కొడుకుల మధ్య చర్చలు జరిపి వివాదాన్ని కొలిక్కి తెచ్చారు. తల్లి దండ్రుల పోషణ కోసం నెలకు 8 వేలు భత్యం ఇవ్వడంతో పాటు ఆలనా, పాలన చూసుకోవాలి. వైద్యానికి సంబంధించి ఖర్చులు చెల్లించాలి. అదే విధంగా తోడబుట్టిన సోదరి లతకు రూ. 6.50 లక్షలు, తండ్రి నుంచి పొందిన భూమి నుంచి 4 గుంటల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలి. ఈ నిబంధనలకు వాది, ప్రతివాదులు అంగీకరించి రాజీపడ్డారు. ఈ మేరకు శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ సందర్భంగా న్యాయమూర్తి సమక్షంలో ప్రతివాది భీమయ్య తన సోదరికి రూ. 5, 50 లక్షలు చెక్కు రూపంలో, రూ. లక్ష నగదు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి కే పావని మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని, సమస్యను శాంతి యుతంగా శాశ్వత పరిష్కారం చేసుకోవాలని సూచించారు. తండ్రి, కొడుకుల నడమ నెలకొన్ని వివాదాన్ని రాజీమార్గంలో పరిష్కరించేందుకు కృషి చేసిన న్యాయవాదులను పలువురు అభినందించారు. లోక్ అదాలత్ కు వచ్చిన కక్షిదారులకు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుతారి శ్రీనివాస్ తాగునీటి వసతిని కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తోట ఆంజనేయులు, ఏజీపీ రాజేశ్ ఖన్నా, ఉమా, రమేష్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



బెల్లంపల్లి, జూన్ 20, (మనం న్యూస్ ) : రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తీవ్రస్థాయిలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కోటా మేరకు మాత్రమే పంటలు కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం తెలంగాణ రైతులపై కక్ష సాధింపు చర్యగా అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి రైతులను దళారుల చేతుల్లోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. శనివారం బెల్లంపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, రైతులకు బోనస్ అందిస్తామని, వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని గొప్పలు చెప్పిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మాట తప్పిందన్నారు. రైతులు తీవ్ర కష్టపడి పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేయకపోవడం వల్ల అనేక మంది రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతే కేంద్రబిందువుగా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని దుర్గం చిన్నయ్య తెలిపారు. రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం, రైతు బీమా ద్వారా రైతు కుటుంబాలకు భరోసా, 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ, వేలాది కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా రైతులకు అండగా నిలిచామని పేర్కొన్నారు. రైతు పండించిన ప్రతి గింజకు ప్రభుత్వం బాధ్యత వహించి కొనుగోలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు.

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు అమలులో జాప్యం చేయడం, రైతు బీమాను నిర్లక్ష్యం చేయడం, ఎరువుల కొరతను నివారించడంలో విఫలమవడం, పంటల కొనుగోళ్లలో ఆలస్యం చేయడం వంటి చర్యలతో రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకుంటున్న నిర్ణయాలకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కోటా మేరకే కొనుగోళ్లు చేస్తామని చెప్పడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తోందని దుర్గం చిన్నయ్య ఆరోపించారు. రాష్ట్రంలో పండే ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేయడం ప్రభుత్వ బాధ్యతేనని, రైతులను నట్టేట ముంచే నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే బీఆర్ఎస్ పార్టీ రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ ఎప్పటికీ ముందుంటుందని, రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా, బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రధానిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 23న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్



పెద్దపల్లి జూన్ 20 (మనం ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అవుతున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నాడని, ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ... ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఏబీవీపీ ఆధ్వర్యంలో జూన్ 23న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ కు పిలుపునిస్తున్నట్లుగా పెద్దపల్లి పట్టణంలో ప్రెస్ మీట్ నిర్వహించారు . ఈ సందర్భంగా స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మారం సందీప్ మాట్లాడుతూ" రేవంత్ రెడ్డి పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కుట్ర చేస్తున్నాడని, అందుకే రేషనలైజేషన్ పేరుతో 23000 ల పాఠశాలలను మూసేందుకు కంకణం కట్టుకున్నాడని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఏజెంట్ లా వ్యవహరిస్తున్నాడని, విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచిందని ఎద్దేవా చేశారు. వెంటనే ప్రభుత్వం ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు,కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా 25% సీట్లను అందించే విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు పర్యవేక్షణ లేకుండా నడుస్తున్నాయని కావున ఖాళీగా ఉన్న ఎంఈఓ,డిఈఓ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక పర్మిషన్ పేరు మీద పలు బ్రాంచు లు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి ఆర్థిక దోపిడీకి పాల్పడుతు సరస్వతి నిలయాలు లాంటి పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీగా ఉన్న టీచింగ్,నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,అదేవిధంగా గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని, ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని,ఎన్ ఈ పి 2020ని,విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలు రీ ఓపెన్ అయిన ఇంతవరకు విద్యార్థులకు స్కూలు యూనిఫామ్స్ ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థ పై చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో "బ్రేక్ ఫాస్ట్ స్కీమ్" ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాలని,ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడిని నియంత్రించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. విద్యార్థి వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 23న ఏబీవీపీ పాఠశాలల బందుకు పిలుపునిచ్చింది. కావునా విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఈ బంద్ కు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు విగ్నేష్, నవీన్ , వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్టకు ముస్తాబైన పెద్దమ్మతల్లి ఆలయం




చిగురుమామిడి: జూన్ 20 (మనం న్యూస్) : ఈనెల 27నుండి జులై 2వరకు చిగురుమామిడి మండల కేంద్రంలో జరిగే శ్రీపెద్దిరాజు,పెద్దమ్మతల్లి నూతన దేవాలయ ప్రతిష్ట మహోత్సవానికి ఆలయాన్ని అన్ని హంగులతో ముదిరాజులు ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా శనివారం జాతరకు సంబంధించిన పోస్టర్లను,కరపత్రాలను,ఆహ్వాన పత్రికలను ఆలయం వద్ద ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చెరుకు సంజీవ్ ఆధ్వర్యంలో ముదిరాజులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజులు మాట్లాడుతూ కరీంనగర్ నుండి హుస్నాబాద్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన 10గుంటల స్థలంలో కోటి 50లక్షల రూపాయలతో అన్ని హంగులతో విశాలమైన స్థలంలో ఎక్కడ లేని విధంగా పెద్దమ్మతల్లి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించినట్లు చెప్పారు. ఈనెల 24న బుధవారం పోచమ్మ బోనాలు,29న సోమవారం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట,30న మంగళవారం ఘటంకుండ,జూన్ 1న బుధవారం పెద్దమ్మతల్లి బోనాలు,జూన్ 2న గురువారం ఓడిబియ్యంతో వారం రోజులపాటు జరిగే శ్రీపెద్దమ్మ తల్లి జాతరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నలువైపుల నుంచి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ముదిరాజులు కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చెరుకు సంజీవ్ కుమార్,ఉపాధ్యక్షులు పొగాకుల రమేష్,కార్యదర్శి గూడ సతీష్ కుమార్, సంఘం పెద్దమనుషులు పొన్నం వెంకటరాజయ్య,చెరుకు చిన్నసమ్మయ్య,కార్యవర్గ సభ్యులు చెరుకు నర్సయ్య, పొన్నం బాలయ్య,పొగాకుల శ్రీకాంత్, జెట్టి సమ్మయ్య,బొల్లి రాములు,మల్లం సదానందం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వడదెబ్బ సోకి ఆదివాసీ మృతి

కాసిపేట, జూన్ 20(మనంన్యూస్)కాసిపేట మండలం గుండ్లపాడ్ గ్రామానికి చెందిన మడావి అర్జు (సుమారు 48సం) అనే ఆదివాసి వడదెబ్బ తో మృతి చెందినట్టు మృతుడి బంధువులు తెలియచేశారు. శుక్రవారం చేనులో పనికి పోయి సాయంత్రం ఇంటికి వచ్చి నీళ్లు తాగాడని, ఆ తర్వాత ఒంటిలో గాబరా గాబారా గా అనిపిస్తున్నదని అన్నాడని, తర్వాత మూడుసార్లు వాంటింగ్ చేసుకున్నాడని, పరిస్థితి గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రి కి తీసుకు వెల్లేందుకు సిద్దపడుతున్న సమయంలో గట్టిగా కేక వేస్తూ ప్రాణాలు వదిలినట్టు వివరించారు. మృతుడికి భార్య, ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి వున్నట్టు తెలియచేశారు.

# గాయత్రి విద్యానికేతన్‌లో యోగా దినోత్సవ వేడుకలు



పెద్దపల్లి టౌన్, జూన్ 20 (మనం న్యూస్) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్‌లో శనివారం యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగ యొక్క ప్రాముఖ్యతను వివరించి, యోగ ద్వారా కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా యోగా గురువు, గాయత్రి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ సురేష్ ప్రత్యేక యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, క్రమశిక్షణ పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచే పలు యోగాసనాలను ప్రదర్శించి వాటి విశిష్టతను వివరించారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, ప్రశాంతతను పొందడానికి అనుసరించాల్సిన యోగాసనాల గురించి కూడా అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా, చురుకుగా కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలను అభ్యసించారు. ఈ సందర్భంగా 8వ తరగతి విద్యార్థి సంపంగి ప్రవీణ్ తన అద్భుతమైన యోగ విన్యాసాలతో అందరినీ ఆకట్టుకుని ప్రత్యేక ప్రశంసలు అందుకున్నాడు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు యోగ యొక్క విశిష్టతను తెలుసుకుని, ప్రతిరోజూ యోగ సాధన చేయాలని సంకల్పించారు. గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీమతి రజనీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి ప్రియాంక, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మానవ ఆరోగ్య జీవనానికి యోగ పునాది

చిగురుమామిడి జూన్ 20 (మనం న్యూస్) : చిగురుమామిడి మండలంలో చిన్న ముల్కనూర్ గ్రామంలోని మోడల్ స్కూల్లో అంతర్జాతీయ యువ దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి హైదరాబాద్కు,చెందిన ప్రాణయోగ సంస్థ అలాగే ఆయుష్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో యోగ అవగాహన సదస్సు అలాగే సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమానికి పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ పి రాములు అధ్యక్ష వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా వివిధ రకాల యోగాసనాలను ప్రదర్శించారు అనంతరం ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రాణయోగ సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ నేటి ఆధునిక జీవనశైలిలో ఒత్తిడిని అధిగమించడానికి యోగ అద్భుతంగా పనిచేస్తుందని చెప్పారు విద్యార్థి దశ నుండి యోగాసనాలు అలవాటు చేసుకోవడం వల్ల ఏకాగ్రత తో పాటు ఉత్తమ వ్యక్తిత్వం, వికాసం కలుగుతుందని వివరించారు, క్రమం తప్పకుండా యోగా సాధనం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారతారని తెలిపారు ,ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రదర్శించిన ఆసనాలు అక్కడ వారందరినీ ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రమ్య యాదవ్, ప్రాణ యోగ సంస్థ బాధ్యులు ప్రేమ సాగర్, జ్యోతి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు



# మాదక ద్రవ్యాల నియంత్రణే.. ప్రధాన లక్ష్యం..!




మల్యాల, జూన్ 20, ( మనం న్యూస్ ) : మాదక ద్రవ్యాల నియంత్రణే ప్రధాన లక్ష్యమని మల్యాల ఎస్ఐ సందీప్ తెలిపారు. శుక్రవారం మల్యాల పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జగిత్యాల జిల్లా సుపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ మార్గదర్శకాలు మేరకు జగిత్యాల జిల్లా బాంబ్ డిటెక్షన్ డాగ్ స్క్వాడ్ బృందం మల్యాల మండలాన్ని సందర్శించిందని, మల్యాల పోలీసులతో కలిసి మండల పరిధిలో విస్తృతంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించామని అన్నారు. మల్యాల మండల పరిధిలోని మల్యాల క్రాస్ రోడ్ ప్రాంతం, కొండగట్టు బస్ స్టాండ్ పరిసరాలు, దుకాణాలు, విగ్రహాల ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయ భవనాలు, ఇతర ముఖ్య ప్రదేశాలలో సోదాలు చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాంబ్ డిటెక్షన్ టీమ్‌తో పాటు గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాల గుర్తింపులో నైపుణ్యం కలిగిన డాగ్ స్క్వాడ్ కుక్కను వినియోగించామని, అనుమానాస్పద ప్రదేశాలు, దుకాణాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాలను సమగ్రంగా పరిశీలించామని తెలిపారు. ముఖ్యంగా నిషేధిత గంజాయి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజా భద్రత, శాంతి భద్రత పరిరక్షణతో పాటు యువతలో మత్తు పదార్థాల వ్యసనం, వాటి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడం, ప్రజల్లో భద్రతపై నమ్మకాన్ని పెంపొందించడం, నేరాలను ముందుగానే అరికట్టడం లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజల భద్రతకు కట్టుబడి ఉందని, నేరాల నివారణ, నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందస్తు చర్యలు చేపడుతోందని అన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యానికి తీవ్రమైన హానికరమైనవని, సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, ప్రజలు గంజాయి వంటి నిషేధిత పదార్థాలను పూర్తిగా బహిష్కరించాలని, వాటి వినియోగం లేదా సరఫరా గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.

# ప్రైవేట్ విద్యాసంస్థలో పుస్తకాల విక్రయంపై విద్యార్థి సంఘం నాయకుల అభ్యంతరం...

జమ్మికుంట, జూన్ 20 (మనం న్యూస్): జమ్మికుంట మండలం వావిలాల సెంటిమెరి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫామ్ ను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల యాజమాన్యమే నేరుగా విక్రయిస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు (బీఆర్ఎస్వీ) కొమ్ము నరేష్, నల్లగాస హరీష్, చింతల కౌశిక్ ఆరోపించారు. సెంటిమెరి ఉన్నత పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో పాఠ్యపుస్తకాలను, స్కూల్ యూనిఫామ్, నోట్ బుక్స్ ను నిలువ ఉంచారని తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించి పాఠశాల వద్దకు వెళ్లి పరిశీలించినట్లు విద్యార్థి సంఘం నాయకులు తెలిపారు. పాఠశాల నిర్వాహకులు ఒకసారి తామే విద్యార్థుల కోసం పాఠ్యపుస్తకాలను, నోట్ బుక్స్ ను తెప్పించామని చెప్పి మరోసారి మాట మార్చి తమకు సంబంధం లేదు. అవి ఏజెన్సీ వాళ్ళు తెప్పించుకొని విక్రయిస్తున్నారని పొంతన లేని సమాధానం చెప్పారని అన్నారు. విషయాన్ని మండల విద్యాధికారి తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారికి తెలపగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు పాఠశాలకు చేరుకున్న మండల విద్యాధికారిని తమతో పాటు పాఠశాల నిర్వాహకులతో మాట్లాడి పలు వివరాలను సేకరించడం జరిగిందన్నారు. మార్కెట్‌లో తక్కువ ధరలకు లభించే పుస్తకాలను, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్ ను విద్యాసంస్థల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. విద్యాసంస్థలు విద్యా బోధనకే పరిమితం కావాలని, పుస్తకాల విక్రయాలను వ్యాపారంగా మార్చడం సరికాదని అన్నారు. పాఠశాల నిర్వహకులే పుస్తకాలను, నోట్ బుక్స్, యూనిఫామ్స్ ను విక్రయించడం వల్ల తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సంబంధిత విద్యాశాఖ అధికారులు వెంటనే విచారణ జరిపి, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



**పుస్తకాలు నిల్వ ఉంచిన గదికి తాళం వేసిన మండల విద్యాధికారిని...**

విద్యార్థి సంఘం నాయకులు అందించిన సమాచారం మేరకు పాఠశాలకు చేరుకున్న మండల విద్యాధికారిని హేమలత పాఠశాల నిర్వాహకుల నుండి పలు వివరాలను సేకరించారు. పాఠశాల సమీపంలోని ఓ ఇంటి గదిలో పాఠ్యపుస్తకాలను, నోట్ బుక్స్ ను నిలువ ఉంచిన విషయం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారిని హేమలత మాట్లాడుతూ... రెండు రోజులలో పుస్తకాల నిలువపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని అన్నారు. పాఠశాల యాజమాన్యానికి ఇట్టి విషయంపై నోటీసు సైతం జారీ చేయునట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం, పుస్తకాలను విక్రయించే ఏజెన్సీ వారి నుండి పూర్తి సమాచారం సేకరించిన తర్వాత తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. అప్పటివరకు పుస్తకాలు, నోట్ బుక్స్ ను నిలువ ఉంచిన గదికి తాళం వేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ విద్యార్థి సంఘం నాయకులు బండారి లవన్, నరెంగుల శివ, గణవేన రమేష్, లింగాల రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆహార భద్రత అధికారుల ఆకస్మిక తనిఖీలు

చిగురుమామిడి జూన్ 20 ( మనం న్యూస్) : ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందుతున్నాయా అనే విషయాన్ని నిర్ధారించేందుకు ఆహార భద్రత అధికారులు ఇందుర్తి గ్రామంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా (రాజస్థాన్ ) స్వీట్ హౌస్, గాయత్రి కిరాణం, భరద్వాజ్ కిరాణ షాపులను పరిశీలించి ఆహార పదార్థాల నాణ్యత లేని అల్లం పేస్ట్ లు , గడువు తేదీలు ముగిసిన బిస్కెట్ ప్యాకెట్స్ ,గులాబ్ జామ్ ,చిప్స్ ప్యాకెట్స్ నిల్వ ఉంచిన పదార్థాలు లభ్యమయ్యాయి , ఇలాంటి గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయించడం పై తీవ్రంగా మండి పడ్డారు . అవసరమైన రికార్డులు, లైసెన్సులు, ఆహార భద్రత నిబంధనల అమలుపై కూడా అధికారులు ఆరా తీశారు. ఏ ఒక్క కిరాణా షాపు కీ లైసెన్స్ లు లేవని వెంటనే లైసెన్స్ లు తీసుకోవాలని దుకాణదారులను ఆహార భద్రత అధికారి అంకిత్ రెడ్డి హెచ్చరించారు. గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించరాదని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ఆహార పదార్థాల నాణ్యతపై అనుమానాలు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆహార భద్రత అధికారులు తెలిపారు.

# యోగతో సంపూర్ణ ఆరోగ్యం



శంకరపట్నం జూన్ 20 (మనం న్యూస్) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం ప్రతి ఒక్కరూ ప్రతి రోజు యోగా చేసి ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందె. మానసిక ప్రశాంతత తో సుఖ సంతోషాలతో ఉండాలని ఉండాలని మొలగూర్ ఆయుష్ వైద్యశాల డాక్టర్ జె, శ్రీదేవి అన్నారు. శనివారం శంకరపట్నం మండలం, మొలంగూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించి యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేస్తే మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం ఎంతో ఆరోగ్యం పొందవచ్చునని ప్రతి ఒక్కరూ ఉదయము, సాయంత్రము వేళల్లో యోగా కోసం కొంత సమయాన్ని కేటాయించుకొని, యోగాసనాలు వేసుకొని ఆరోగ్యంగా మానసిక ప్రశాంతత తో సుఖసంతోషాలతో జీవించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు కంకణాల నీరజ మాట్లాడుతూ యోగా వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాసనాలు యోగా చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సుల్తానాబాద్ జూన్ 20 (మనం న్యూస్) : ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని సుల్తానాబాద్ జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు శనివారం అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని మండల న్యాయ సేవ అధికార సంస్థ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి స్థానిక కోర్టు ఆవరణలో పట్టణానికి చెందిన యోగా మాస్టర్ యెల్లె మల్లేశం వివిధ యోగ ఆసనాలు నేర్పించి వ్యాయామం చేయించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా శరీరం లోని అన్ని అవయవాలకు వ్యాయామం జరుగుతుందని, ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. యోగా చేయడం ద్వారా అనారోగ్య సమస్యలు దరిచేరవని, ప్రతి ఒక్కరూ నిత్యం యోగా చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా మాస్టర్ ఎల్లె మల్లేశం ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పొద్దాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు పడాల శ్రీరాములు, జోగుల రమేష్ , బోయిని భూమయ్య, పెగడ శ్యామ్ సుందర్, గుడ్ల వెంకటేష్, జి.గోపినాథ్,, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



# శరీరాన్ని, మనస్సును ఏకం చేసేదే యోగా



రామగిరి,జూన్ 20 (మనం న్యూస్): శరీరాన్ని, మనస్సును ఏకం చేసేదే యోగా అని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, శనివారం రామగుండం-3, ఆడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల ఆధ్వర్యంలో జి.యం. కార్యాలయం నందు నిర్వహించిన యోగాభ్యాస కార్యక్రమాన్ని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం జి.ఎం.కార్యాలయంలోని వివిధ విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులతో యోగా శిక్షకుడు బొంకూరి మోహన్ యోగా అభ్యసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జి.యం లు మాట్లాడుతూ యోగా అనేది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా, ఒత్తిడిని నివారిస్తుందని అన్నారు. ప్రపంచ మానవాళి ఆరోగ్యం కోసం భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషితో ఐక్యరాజ్య సమితిలో ఆమోదింపబడి 21 జూన్ రోజు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం యోగా దినోత్సవం జరుపుకుంటున్నారన్నారు. ప్రపంచ దేశాలు యోగా విశిష్టతను గురించి అవగాహన కల్పిస్తూ, యోగాభ్యసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఉద్యోగులందరూ యోగా చేస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు సంతోష్, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షులు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ ఎ.ఉదయ భాస్కర్, ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, వివిధ విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులు పొరుగు సేవల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సంసిద్ధత కార్యక్రమాలపై అవగాహన



సుల్తానాబాద్ జూన్ 20 (మనం న్యూస్) మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి ఏ. రాజయ్య అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఏ. రాజయ్య మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ నెలాఖరు వరకు "బడిబాట" కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగించాలని సూచించారు. తక్కువ విద్యార్థుల నమోదు ఉన్న పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షులు, సభ్యుల సహకారంతో విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్మెంట్) పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రేపటి నుంచి 45 రోజుల పాటు పాఠశాలల్లో సంసిద్ధత (రెడీనెస్) కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా పౌష్టికాహారం అందించడంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థుల ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను సకాలంలో నమోదు చేయాలని సూచించారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ ( ఎఫ్ ఎల్ ఎన్) కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల అభ్యాస సామర్థ్యాలను గుర్తించి, జూలై మొదటి వారంలో బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించి ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి. దివాకర్, ఎస్. రత్నాకర్ రెడ్డి, వి. కవిత, మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల రిసోర్స్ పర్సన్స్ ( ఎమ్మార్పీఎస్), క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ ( సిఆర్పిఎస్), ఎంఐఎస్, సీఎస్‌వో సిబ్బంది పాల్గొన్నారు.

# స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కోరుట్ల జూన్ 20 (మనం న్యూస్ ) : కోరుట్ల నియోజకవర్గం పట్టణంలో తెలంగాణ రాష్ట్రంలోని స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుట్ల పట్టణ స్వర్ణకారుల సంఘం శనివారం రెవిన్యూ డివిజనల్ అధికారికి, కోరుట్ల తాహసిల్దారుకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఇందూరి ప్రసాద్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీరాముల శ్రీకాంత్ మాట్లాడుతూ స్వర్ణకారుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. అలాగే జీవో నెంబర్ 272 ను సవరణ చేసి మరింత పటిష్టంగా తయారు చేసి దొంగ బంగారం రికవరీ కేసులో స్వర్ణకారులపై కేసులు లేకుండా చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన స్వర్ణకార వృత్తిదారులకు ప్రతినెల గీత కార్మికులకు చెల్లిస్తున్నట్టుగా పెన్షన్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వినతుల్ని డిమాండ్లను పరిగణలోకి తీసుకొని సాధ్యమైనంత తొందరలో స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పబ్బోజీ లక్ష్మీనారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి మండలోజీ రవీందర్ లతో పాటు బెజ్జారపు శ్రీనివాస్, అక్కినపల్లి వేణు, లతో పాటు పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# రేచపల్లిలో అక్షరాభ్యాసం.. ప్రీస్కూల్ యూనిఫాంల పంపిణీ



సారంగాపూర్, జూన్ 20,(మనం న్యూస్) : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామంలో మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం, ప్రీస్కూల్ చిన్నారులకు యూనిఫాంల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాస మహేష్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు విద్యతో పాటు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, సమగ్ర అభివృద్ధి కల్పించబడుతుందని తెలిపారు. అలాగే అంగన్వాడీ టీచర్లు అందిస్తున్న సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలని, పిల్లల భవిష్యత్తు కోసం ప్రతి తల్లిదండ్రులు అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వాణిశ్రీ, ఏసీడీపీఓ మౌనిక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోడ రెడ్డి, సూపర్వైజర్ లత, ఏఎన్ఎంలు, గ్రామస్తులు, తల్లులు, చిన్నారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఇనుగాల శ్రీహన్ రెడ్డి బర్త్డే వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు




చిగురుమామిడి: జూన్ 20 (మనం న్యూస్) : మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,గ్రామ శాఖ అధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి సోదరుడు ఇనుగాల శ్రీకాంత్ రెడ్డి చైతన్యల కుమారుడు శ్రీహాన్ రెడ్డి మొదటి పుట్టినరోజు వేడుకలు వారి స్వగృహంలో శనివారం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సర్పంచ్ గుల్ల రజిత రాజు,మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్,సర్పంచులు మార్క రాజ్ కుమార్ గౌడ్,కాటం సంపత్ రెడ్డిలు హాజరై బాలుడిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుతుబుద్దీన్,ఇనుగాల రాజ్యలక్ష్మి కనకారెడ్డి,కాంగ్రెస్ నాయకులు చిట్టుమల్ల రవీందర్,గోగూరి మురహరి రెడ్డి,మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు షాబుద్దీన్,పచ్చిమట్ల జగన్,గట్టు ప్రశాంత్,దోమ శ్రీనివాస్ రెడ్డి, కొక్కిస శ్రీనివాస్,గడ్డం అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ విఫలమై యువకుని మృతి

లక్షెట్టిపేట జూన్ 20 (మనం న్యూస్) : లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బైరి రాజకుమార్ అనే 26సంవత్సరాల యువకుడు ప్రేమ విఫలం అయి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకొని మృతిచేందాడు. వివరాల్లోకెళ్తే మృతుడు మార్బుల్ వర్క్ చేస్తుంటాడు. గత నాలుగు సంవత్సరాలుగా ఇదే మండలంలోని ఒక గ్రామానికి చెందిన అమ్మాయి ఇద్దరు ప్రేమించుకుని కొన్ని రోజులుగా మనస్పర్థలతో విడిపోయారు. అప్పటినుండి మృతుడు మనస్తపంతో బాధపడుతూ ఇంట్లో డాబాపైన పంటకుకొట్టే పురుగుల మందుతాగడంతో గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల తరలించాగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి బైరి కాంత్తయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ట్ల పోలీసులు తెలిపారు

## క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం



బోయిన్‌పల్లి, జూన్ 20:(మనం న్యూస్ ): మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి లత అనే మహిళ గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమె ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న బోయిన్ పల్లి కి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు ఎడపల్లి బాబు శనివారం బాధితురాలికి రూ. 5,000 (ఐదు వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బాధితురాలి నివాసానికి వెళ్లి, నగదును అందజేయడంతో పాటు ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అధైర్యపడకుండా వ్యాధితో పోరాడాలని, లతకు తమ వంతు అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ సేవా కార్యక్రమంలో బూరుగుపల్లి గ్రామ ఉపసర్పంచ్ కళ్ళపెల్లి చంద్రయ్య, వార్డు సభ్యులు అతికం రాజశేఖర్ గౌడ్, సామాజిక సేవకులు బోయిని హరీష్, రాకేష్, ఎడపల్లి వంశీ, బీసీ సంఘాల నాయకులు ముద్దం లక్ష్మీరాజం తదితరులు పాల్గొని ఎడపల్లి బాబు చేసిన సాయాన్ని అభినందించారు

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పైన శిక్షణా కార్యక్రమం



రాయికల్,జూన్ 20(మనం న్యూస్) : శనివారం రోజున రాయికల్ పట్టణంలోని వర్తక సంఘంలో ఎన్నికల ఓటర్ జాబితా యొక్క ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పైన బూత్ లెవల్ అధికారులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో తహశీల్దార్ నాగార్జున, నియోజకవర్గం మాస్టర్ ట్రైనర్ రాజశేఖర్, బి ఎల్ ఓ సూపర్వైజర్స్ మరియు కార్యాల సిబ్బంది పాల్గొన్నారు.

## యోగాతోనే ఆరోగ్యవంతమైన జీవితం



జమ్మికుంట, జూన్ 20 (మనం న్యూస్): యోగా తోనే ఆరోగ్యవంతమైన జీవితం ఉంటుందని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్.బి.రమేష్ అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొపెసర్. బి. రమేష్ అధ్యక్షతన జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం ముందస్తు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది యోగా ఆసనాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... నిత్యం యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతను, శారీరక దృఢత్వాన్ని పొందుతారని అన్నారు. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో యోగా ప్రతి ఒక్కరికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఓదేలు కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎంబాడి రవి, లోఖండే, రవిందర్, అధ్యాపకులు డాక్టర్ గణేష్, డాక్టర్ రాజేంద్రం, డాక్టర శ్యామల, డాక్టర్ మాధవి, ఉమా కిరణ్, డాక్టర్ రాజకుమార్, కిరణ్ కుమార్, పి. శ్రీనివాస్ రెడ్డి, మమతా, డాక్టర్ సుష్మ, డాక్టర్, రవి ప్రకాశ్, డాక్టర్ శ్రీనివాస్, అరుణారాజ్ , సాయి కుమార్ శ్రీకాంత్, దీనా, డా. స్వప్న, సీనియర్ అసిస్టెంట్ డి. తిరుపతి, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 23న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్



బెల్లంపల్లి జూన్ 20( మనం న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్య నిర్వీర్యం అవుతున్నది.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యాశాఖ మంత్రిగా ఉండి ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తున్నాడని, ప్రభుత్వ పాఠశాలల ఎత్తివేతకు కుట్ర చేస్తూ... ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి కొమ్ముకాస్తున్న రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ాదీవూ ఆధ్వర్యంలో జూన్ 23న రాష్ట్ర వ్యాప్త పాఠశాలల బంద్ కు పిలుపునిస్తున్నట్లుగా బెల్లంపల్లి పట్టణంలో ప్రెస్ మీట్ నిర్వహించారు .ఈ సందర్భంగా బెల్లంపల్లి నగర కార్యదర్శి కొమురవెల్లి శ్రీ చరణ్ మాట్లాడుతూ" రేవంత్ రెడ్డి పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని కుట్ర చేస్తున్నాడని, అందుకే రేషనలైజేషన్ పేరుతో 23000 ల పాఠశాలలను మూసేందుకు కంకణం కట్టుకున్నాడని,ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఏజెంట్ లా వ్యవహరిస్తున్నాడని, విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరిచిందని ఎద్దేవా చేశారు.వెంటనే ప్రభుత్వం ఫీజుల దోపిడీని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు,కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా 25% సీట్లను అందించే విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. రాష్ట్రంలో పాఠశాలలు పర్యవేక్షణ లేకుండా నడుస్తున్నాయని కావున ఖాళీగా ఉన్న ఎంఈఓ,డిఈఓ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. ఒక పర్మిషన్ పేరు మీద పలు బ్రాంచ్ లు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి ఆర్థిక దోపిడీకి పాల్పడుతు సరస్వతి నిలయాలు లాంటి పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీగా ఉన్న టీచింగ్,నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని,అదేవిధంగా గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని, ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని,చీజ్రూ 2020ని,విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పాఠశాలలు రీ ఓపెన్ అయిన ఇంతవరకు విద్యార్థులకు స్కూలు యూనిఫామ్స్ ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యా వ్యవస్థ పై చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో "బ్రేక్ ఫాస్ట్ స్కీమ్" ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ విద్యా వ్యవస్థను గాడి పెట్టాలని,ప్రైవేట్,కార్పొరేట్ విద్యాసంస్థల ఆర్థిక దోపిడిని నియంత్రించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు.విద్యార్థి వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నటువంటి రాష్ట్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ నెల 23న ఏబీవీపీ పాఠశాలల బందుకు పిలుపునిచ్చింది. కావునా విద్యార్థులు,వారి తల్లిదండ్రులు ఈ బంద్ కు సహకరించి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి కొమురవెల్లి శ్రీ చరణ్, యువ రాజ్, మల్లికార్జున్, సాత్విక్,తదితరులు పాల్గొన్నారు.

# వార్షిక విద్యా ప్రణాళికపై సమావేశం




మంథని జూన్20 (మనం న్యూస్) మంథని మండల వార్షిక విద్యా ప్రణాళిక గురించి మంథని మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఓరియంటేషన్ కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దాసరి లక్ష్మి మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా ఉపాధ్యాయులంతా ఆన్లైన్,ఆఫ్ లైన్ రిపోర్టుల విషయంలోనూ, విద్యార్థుల ప్రగతిని మెరుగుపరిచే దిశగా ప్రయత్నం చేసి పెద్దపల్లి జిల్లాలో మంథని మండల స్థానాన్ని మరింత ముందుకు తెచ్చేలా కృషి చేయాలని కోరారు. పర్ఫార్మెన్స్ గ్రేడ్ ఇండికేటర్ల మదింపులో పెద్దపెల్లి జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించినందుకు గాను అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఇదే విధంగా కృషి చేసి మంచి ఫలితాలను సాధించాలని తెలిపారు.ఈ సందర్భంగా జెడ్పిహెచ్ఎస్ బాయ్స్, జి హెచ్ ఎస్,ఆరెంద పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయులు మోసం శ్రీనివాస్, జె.సురేష్ కుమార్, ఈదులపల్లి నరసింహారావులు మాట్లాడుతూ తమ పాఠశాల సముదాలలో పనిచేసే ఉపాధ్యాయులంతా ఎఫ్ ఎల్ ఎన్ లోని అన్ని సామర్థ్యాలలో మంచి ఫలితాలు వచ్చేలాగా కృషి చేయాలని తద్వారా స్కూల్ కాంప్లెక్స్ యొక్క ర్యాంకింగ్ ను పెంచాలని కోరారు. జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ ప్రధానోపాధ్యాయురాలు సుమలత మాట్లాడుతూ గత సంవత్సరం లాగా అనే ఈ సంవత్సరం కూడా ఉపాధ్యాయులంతా తమ తమ పాఠశాలలో అద్భుతమైన ఫలితాలను సాధించాలని తెలిపారు.ఈ సందర్భంగా మంథని మండలంలోని మల్లెపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు ఎగ్గడి సురేష్ గత విద్యా సంవత్సరం పాఠశాల మొత్తం హాజరులో 90% హాజరు సాధించినందుకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్ అందజేసిన ప్రశంసపత్రాన్ని ఎంఈఓ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా అందుకున్నారు.ఈ అరుదైన ప్రశంసను అందుకున్నందుకు ఆయనను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ లు మల్లయ్య,సుప్రజ, రాధిక,స్వప్న,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహిళ సర్పంచ్‌ని సన్మానించిన కేంద్ర మంత్రి....

కరీంనగర్ జూన్ 20(మనం న్యూస్)... ఆత్మనిర్భర్ మహిళ పంచాయత్ పోటీలో దేశవ్యాప్తంగా ప్రథమ స్థానం సాధించిన పార్లమెంట్ పరిధిలోని రామడుగు మండలం లో లికొరటపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి మేకల మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ నీ కేంద్ర హోం శాఖ సహాయక మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించి బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకొని తమ హర్షాతిరేకాన్ని వ్యక్తం చేశారు. ఈ విజయం కొరటపల్లి గ్రామానికి విశిష్ట గుర్తింపును తీసుకువచ్చిందని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మేకల మహేశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సహకారం తోనే ఇంతటి ఘన విజయాన్ని సాధించామని అన్నారు.రాబోయే రోజుల్లో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి దేశంలో నే ఉత్తమ గ్రామ పంచాయితీ గా ఆదర్శంగా తీర్చి దిద్దుతామని తెలిపారు. దేశంలోనే మా గ్రామానికి ప్రథమ స్థానం ఫస్ట్ ప్రైజ్ మా సర్పంచ్ సాధించినందుకు గ్రామ ప్రజలందరు కూడా మాట్లాడుతూ గర్వపడతా ఉన్నాం. ఇకముందు ఎన్నో విజయాలు దక్కాలని ఈ సందర్భంగా ప్రజలు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, ఉపసర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామ వివిధ కుల సంఘాల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# నీట్--2026 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి....

**-జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా..**

కరీంనగర్, జూన్ 20 (మనం బ్యూరో)....వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్--2026) నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఏడు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 3,001 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని వెల్లడించారు. అభ్యర్థులను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, ఆ తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పరీక్ష నిర్వహణకు సంబంధించి ఆయా కేంద్రాలకు ముఖ్య పర్యవేక్షకులు, నోడల్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. పరీక్ష సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి అవసరమైన సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు, జామర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులను కేంద్రాల నుంచి బయటకు అనుమతించబోమని చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో ఆరోగ్య శాఖ సహకారంతో ప్రత్యేక సైకాలజికల్ సపోర్ట్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రాల సమీపంలో అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పరీక్ష నిర్వహించే గదుల్లో తగిన తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలను కల్పించినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వెలుపల తల్లిదండ్రుల కోసం ప్రత్యేక వేచి ఉండే ప్రదేశాలు, టెంట్లు, తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయ నున్నట్లు, భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 163 అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్, ఇటీవల దిగిన రెండు పాస్‌పోర్ట్ సైజ్ రంగు ఫోటోలు, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. ఆహార పదార్థాలు, నీటి సీసాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాలెట్లు, చేతి గడియారాలు, కెమెరాలు, బెల్టులు, స్కేలు, పరీక్ష ప్యాడ్‌లు, క్యాలిక్యులేటర్లు తదితర వస్తువులకు పరీక్షా కేంద్రాల్లో అనుమతి ఉండదని తెలిపారు. పెన్నులను పరీక్షా కేంద్రంలోనే నిర్వాహకులు అందజేస్తారని, ఆభరణాలు, బూట్లు, భారీ దుస్తులు ధరించకుండా రావాలని సూచించారు. బయోమెట్రిక్ హాజరు ప్రక్రియ ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, పరీక్ష ముగిసే వరకు కేంద్రాలను విడిచిపెట్టేందుకు అవకాశం ఉండదని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు.

# ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకున్న గ్రామస్తులు

రాజన్న సిరిసిల్ల,జూన్. 20(మనం న్యూస్ )కొనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలో ఇసుక ట్రాక్టర్లు అతి వేగంగా వెళ్లడంతో ప్రజలకు విద్యార్థులకు వృద్ధులకు ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో నుంచి వెళ్తున్న కొన్ని ట్రాక్టర్లకు నెంబర్ ప్లేట్ లేకపోయినా అధికారులు ఎలా అనుమతిని స్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నెంబర్ ప్లేట్లు లేని వాహనాలు ఇసుక రవాణా చేస్తున్నారని దీనిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అతివేగంతో ట్రాక్టర్లు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామంలో వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఇసుక రవాణాను పూర్తిగా నిబంధనల ప్రకారం నిర్వహించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.



## సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

మేడిపల్లి జూన్ 20 (మనం న్యూస్) : మేడిపల్లి మండలంలోని కట్లకుంట ఎస్సీ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారుల విద్యారంభానికి ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీమతి గోకల సుమలత, ఉపసర్పంచ్ గడ్డం జలంధర్ రెడ్డి, ఏఏపీసీ చైర్‌పర్సన్ నూతిపెల్లి లత, మాజీ ఉపసర్పంచ్ నూతిపెల్లి శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి ఆశీర్వదించారు. అనంతరం వారు మాట్లాడుతూ, విద్య ప్రతి చిన్నారి హక్కు అని, తల్లిదండ్రులు పిల్లల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



## రూపాదేవి రెండవ వర్ధంతి.. అనాథాశ్రమంలో పండ్ల పంపిణీ



మల్యాల, జూన్20,( మనం న్యూస్ ) : దివంగత శ్రీమతి మేడిపల్లి రూపాదేవి రెండవ వర్ధంతి సందర్భంగా శనివారం మల్యాలలో సేవా కార్యక్రమం నిర్వహించారు. మల్యాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక అనాథాశ్రమం, వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. రూపాదేవి సత్యం ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లామని శ్రీనివాస్ గౌడ్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూకపల్లి రాజారావు, సర్పంచ్ మిలిటరీ శ్రీనివాస్, గుర్రం విజయ్, మల్యాల ఉపసర్పంచ్ ఘట్కు వినయ్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మ్యాక లక్ష్మన్, బండి రవి గౌడ్, సతీష్ రెడ్డి, గుర్రం శ్రీకాంత్, కోరే వెంకటేశు, ఎండి అజార్, మారుతి, దత్తు తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ పాఠశాలలో టీపీయూఎస్ సభ్యత్వ అభియాన్ దివాస్ నిర్వహణ

మేడిపల్లి జూన్ 20 (మనం న్యూస్) : మేడిపల్లి మండలంలోని కొండాపూర్ పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు సభ్యత్వ అభియాన్ దివాస్ కార్యక్రమాన్ని టీపీయూఎస్ మేడిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అకాడమిక్ కో-కన్వీనర్ మల్హాల్ రావు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణతో పాటు విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఏకైక సంఘం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే (పీఆర్సీ) అమలు చేయాలని, (సీపీఎస్) నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత (పెన్షన్) విధానంను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని, ప్రతి ఉపాధ్యాయుడు సంఘం సభ్యత్వం తీసుకొని సంఘ బలోపేతానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అంకతి లింగారెడ్డి, జిల్లా కన్వీనర్ కొల్లూరి రాజేందర్, మండల అధ్యక్షుడు మునీందర్, ప్రధాన కార్యదర్శి న్యాలం వెంకటేష్, నాయకులు వేణుగోపాల్, మహిళా కార్యదర్శి రోజారాణి, కార్యదర్శి నరేంద్రతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# రాజీమార్గమే రాజమార్గం




హుజురాబాద్, జూన్ 20 (మనం న్యూస్): హుజురాబాద్ కోర్టు ఆవరణలో శనివారం మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో 655 కేసులకు పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి పిబి కిరణ్ కుమార్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పద్మ సాయిశ్రీ లు మాట్లాడుతూ... రాజీమార్గమే రాజమార్గమని క్షణికావేశంలో కేసులు పెట్టుకోవడం వల్ల నష్టపోతామని అన్నారు. క్షణికావేశంలో చేసే చిన్నచిన్న పొరపాట్లే పెద్దగా మారి జీవితానికి ముప్పుగా పరిణమిస్తాయన్నారు. రాజీమార్గం ద్వారా లోక్ అదాలత్ లో సత్వరమే కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు వీణా ప్రణతి, బోనగిరి కుమారస్వామి, వెంకటేశ్వరరావు, లింగమూర్తి, పలువురు పోలీసులు, వివిధ సంస్థల ఉద్యోగులు పాల్గొన్నారు.

# పంట అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కలియ దున్నాలి....




మంథని,జూన్ 20 (మనం న్యూస్)పంట అవశేషాలను కాల్చకుండా భూమిలోనే కలియ దున్నాలని ఎల్ఆర్ఏ ఫీల్డ్ ఆఫీసర్ రాజశేఖర్ పేర్కొన్నారు.శనివారం మంథని మండలం పోతారం గ్రామంలో ల్యాండ్ మార్క్ రీసెర్చ్ అగ్రి ప్రాజెక్టులో భాగంగా భూసార పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని పెంపొందించడం కోసం పశువుల పెంట, చెరువు మట్టి, నవధాన్యాలు సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులకు సాయిల్ హెల్త్ కార్డు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు రాజశేఖర్, రాజు,సంతోష్,గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న అదనపు కలెక్టర్ రాజగౌడ్

మల్యాల, జూన్ 20,(మనం న్యూస్): జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ జి. రాజగౌడ్ శనివారం కుటుంబ సమేతంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న అదనపు కలెక్టర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ స్థానాచారి కపిందర్ వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి ఆశీర్వచనం అందజేసి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షకులు సునీల్ అదనపు కలెక్టర్‌ను శాలువతో సత్కరించి, లడ్డూ ప్రసాదం అందజేశారు.



# వేములవాడ బైపాస్ రోడ్డుకు సరికొత్త వెలుగులు..



వేములవాడ,జూన్ 20(మనం న్యూస్):వేములవాడ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే రహదారుల ఆధునీకరణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితో పట్టణ బైపాస్ రోడ్డులో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సెంటర్ లైటింగ్ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనుల పురోగతిని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బైపాస్ రోడ్డు పొడవునా జరుగుతున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వైరింగ్ పనులను వారు దగ్గరుండి వీక్షించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అక్కడ ఉన్న ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎక్కడా నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా, అత్యాధునిక సాంకేతికతతో, నిర్ణీత గడువులోగా పనులన్నీ ముగించి వెలుతురును అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బైపాస్ రోడ్డులో సెంటర్ లైటింగ్ అందుబాటులోకి వస్తే చీకటి కారణంగా జరిగే రహదారి ప్రమాదాలు పూర్తిగా తగ్గుముఖం పడతాయని, వాహనదారులకు మెరుగైన వెలుతురు లభించి ప్రయాణం ఎంతో సురక్షితంగా మారుతుందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. పట్టణ ప్రజలతో పాటు వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు సైతం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో త్వరలోనే ఈ పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని మున్సిపల్ చైర్మన్ వివరించారు.

# వేములవాడ మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి పనులపై చైర్మన్ సుదీర్ఘ సమీక్ష



వేములవాడ,జూన్ 20(మనం న్యూస్):వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో శనివారం పట్టణ ప్రగతి పనులపై మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ లోకేష్ సంయుక్తంగా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో సాగుతున్న నక్షా సర్వే పురోగతి, ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు, పెన్షన్ ఐ-ఆప్షన్ అథెంటికేషన్, వనమహోత్సవం కార్యక్రమాలపై వారు అధికారులతో క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. నక్షా సర్వేలో భూములు, ఆస్తుల వివరాల నమోదులో అత్యంత ఖచ్చితత్వం, పారదర్శకత పాటించాలన్నారు. సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్వేను వేగవంతం చేయాలని మేనేజర్ సంపత్ రెడ్డిని ఆదేశించారు. అలాగే, నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చూడాలని, దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి నివేదికలు సిద్ధం చేయాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ నిధులు సకాలంలో చేరేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. పెన్షన్ ఐ-ఆప్షన్ అథెంటికేషన్ ప్రక్రియకు సోమవారమే చివరి తేదీ అని, ఆలోగా అర్హులందరికీ అథెంటికేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం, రానున్న వనమహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కమిషనర్ లోకేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలులో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, నక్షా సర్వే, ఇందిరమ్మ ఇండ్ల సర్వే, పెన్షన్ ప్రక్రియల్లో ఎలాంటి అలసత్వాన్ని వహించవద్దని పేర్కొన్నారు. వేములవాడ మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శంగా నిలపాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, వార్డు అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మేడిపల్లి రూపాదేవి జ్ఞాపకార్థం హనుమాన్ టెంపుల్ ముందు మారేడు చెట్టు

చొప్పదండి జూన్ 20(మనం న్యూస్).. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి రెండవ వర్ధంతి సందర్భంగా శనివారం కాట్నపల్లి 4వ వార్డ్ మెంబర్ కటకోల తార లక్ష్మణ్ ఆధ్వర్యంలో తమగ్రామంలో హనుమాన్ టెంపుల్ దగ్గర రూపాదేవి జ్ఞాపకార్థంగా భక్తులకు అన్ని విధాలుగా ఉపయోగపడే మారేడు చెట్టు నాటారు. ఈ సందర్భంగా కట్టకోల తారలక్ష్మణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడుతూ చెట్లను నాటి, చెట్లకు కంచెతో తగు జాగ్రత్తలు తీసుకోని అధిక చెట్లను పెంచి, పెద్ద చేసి రానున్న కాలంలో భావితరాలకు ఆరోగ్యపరమైన,ఆహ్లాదకరమైన వాతావరణాన్ని భావితరాలకు అందించే బాధ్యత మన అందరిదీ అని అన్నారు, అలాగే ముఖ్యంగా ఈ తరం వారు చెట్లను నాటడం ఒక వ్యాపకంగా పెట్టుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# లోక్ అదాలత్.. సిరిసిల్ల జిల్లాలో 3,909 కేసుల పరిష్కారం

రాజన్న సిరిసిల్ల, జూన్ 20 (మనం ప్రతినిధి ): జిల్లా చట్టపరమైన సేవల అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం విజయవంతమైంది. జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న మొత్తం 3,909 కేసులను పరస్పర రాజీ మార్గంలో పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ తెలిపారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా బాధితులకు నష్టపరిహారం జరిమానాల రూపంలో రూ. 2,27,71,225/- చెల్లించడం జరిగిందని ఆమె వివరించారు.



పరిష్కారమైన కేసుల వివరాలు:

ఈ లోక్ అదాలత్‌లో రికార్డు స్థాయిలో ట్రాఫిక్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులతో పాటు పలు సివిల్, క్రిమినల్ కేసులు ముగిశాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి:

ట్రాఫిక్ చలాన్ కేసులు: 2,419, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు: 1,028, క్రిమినల్ కేసులు: 246, బ్యాంకు రికవరీ కేసులు: 86, సైబర్ క్రైమ్ కేసులు: 61, బీసనల్ కేసులు: 23, మోటార్ వాహన ప్రమాద కేసులు : 15, సివిల్ తగాదాలు: 10, ఎక్సైజ్ కేసులు: 09, కుటుంబ తగాదాలు భార్యాభర్తల వివాదాలు 08, చెక్ బౌన్స్ కేసులు: 04

ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి బి. పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, అదనపు ఎస్పీ డి. చంద్రయ్య, సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి కమ్ ఇన్‌చార్జ్ కార్యదర్శి పి. లక్ష్మణాచారి పాల్గొన్నారు. వీరితో పాటు సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆవునూరి రమాకాంతరావు, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, ఇతర న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, బ్యాంకు అధికారులు పెద్ద సంఖ్యలో కక్షిదారులు పాల్గొని కేసుల త్వరితగతిన పరిష్కారానికి సహకరించారు. కోర్టుల చుట్టూ తిరిగే సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకునేందుకు లోక్ అదాలత్ ఒక చక్కని వేదికని, కక్షిదారులు ఈ అవకాశాన్ని అద్భుతంగా వినియోగించుకున్నారని న్యాయమూర్తులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

# కోల్ బెల్ట్‌లో నడుస్తున్న కోల్డ్ వార్

## బాయిబాట పేరుతో టిఆర్ఎస్ చీఫ్ కవిత పర్యటన

## సింగరేణి భరోసా యాత్ర లో కమలం

## సంస్థలో అవినీతి పై బిఆర్ఎస్ బిగ్ ఫైట్

## పీఆర్పి బకాయిల కోసం అధికారుల సంఘం సమరం

కాసిపేట, జూన్ 20(మనంన్యూస్)తెలంగాణ రాష్ట్రం లో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లా ల్లో విస్తరించి వున్న కోల్ బెల్ట్ ప్రాంతం కోల్డ్ వార్ తో అట్టుడుకుతున్నది. రాష్ట్రం లో ఎలాంటి ఎన్నికలు సమీపంలో లేకపోయినా పోటీలుపడి రాజకీయ పార్టీ ల పర్యటనలకు క్యూ కడుతున్నారు. దీని కారణాలను రాజకీయ విశ్లేషకులు పలు విధాలా వారి అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. పైన పేర్కొన్నా విదంగా కోల్ బెల్ట్ ప్రాంతం కొంత చైతన్యవంత మై ఉండడం, 12 అసెంబ్లీ నియోజకవర్గాలు, 4 పార్లమెంట్ స్థానాలు ఉండి, సంస్థలో దాదాపు 40 వేల కార్మికులు, 20 వేలకు పైగ కాంట్రాక్ట్ కార్మికులు, సుమారు 60 వేలు సంగరేణి పెన్షన్ దారులు, వారి కుటుంబాలు, వారితో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు కలిగి అంటే లక్షల్లో ఓటర్లు రాజకీయాలతో సంబంధాలు కలిగి ఉండడం, ప్రజాప్రతినిధుల గెలుపు ఓటములను శాసించే శక్తి గా, మె-ంతంగా రాష్ట్రం లో ఎవరు అధికారం లో వుండాలనే నిర్ణయించే ఒక బలమైనా ఓటర్లు ఈ సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో ఉండడం విశేషం. అందుకే మరో రెండున్నర ఏళ్ల అసెంబ్లీ ఎన్నికల సంది కాలం నేపథ్యంలో సింగరేణి చుట్టేద్దామనే ముందస్తు ప్రణాళికలతో పార్టీలు పర్యటనలు చేస్తున్నారని అంటున్నారు. అందుకు ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొమురం భీమ్ జిల్లా పర్యటన, అటు తర్వాత డిప్యూటి సిఎమ్ భట్టి విక్రమార్క, మంచిర్యాల పర్యటనలు ఒక ఉదాహరంగా పేర్కొంటున్నారు. అదే విదంగా మాజీ ఎమ్మెల్సీ కలువకుంట్ల కవిత ఆధ్వర్యంలో రాష్ట్రం లో కొత్తగా పురుడు పోసుకున్న తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ చీఫ్ గా కవిత ఈ నెల 15 నుండి 20 తేదీ వరకు సింగరేణి బాయిబాట పేరున బొగ్గు గనులు, పట్టణాలను సందర్శిస్తూ పర్యటన కొనసాగించారు. అయితే కవిత వేంట హెచ్ఎమ్ఎస్ కార్మిక సంఘం మద్దతుగా కలిసి బాట కార్యక్రమం నిర్వహించడం గమనార్హం. కవిత పర్యటనకు ముందు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు, గోదావరిఖని, భూపాలపల్లి లో పార్టీ శ్రేణులు, పార్టీ అనుబంధ కార్మిక సంఘం టిబిజీకేస్ నాయకులు, కార్యకర్తల తో సమావేశాలు, ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల పర్యటనకు వచ్చారు. అదేవిదంగా శుక్రవారం కమలం పార్టీ కి చెందిన ప్రజా ప్రతినిధుల బృందం సింగరేణి భరోసా యాత్ర పేరిట మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఉపరితల గనుల సందర్శన కార్యక్రమం చేయటట్టారు. బిజెపి శాసన సభ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మరియు ఎమ్మెల్యే లు, పార్టీ నాయకులు ఓసిపి పర్యటన నేపథ్యంలో పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి, వారి గనుల సందర్శన అడ్డుకున్నారు. అటు తర్వాత మీడియా సమావేశం లో పోలీసులు, ప్రభుత్వం, సింగరేణి పై ఘాటు విమర్శలతో మండిపడ్డారు. జరుగుతున్న రాజకీయ పరిణామాలు గమనించినట్లయితే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి కోల్ బెల్ట్ ప్రాంతం లో ఒక బలమైన శక్తిగా యెదగాలనె లక్ష్యం కనిపిస్తున్నది. పార్టీల పర్యటనలు, సింగరేణి లో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని ఈ సంఘటనపై విచారణ జరపాలని,సంస్థకు రావాల్సిన వేంకటేష్ కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాలని,నిలిచి పోయిన మెడికల్ బోర్డ్ పునరుద్దరించాలని, కొత్త గనులు తీసుకురావాలని, కార్మిక సమస్యలు పరిష్కరించాలని, ఇలా పలు డిమాండ్ లు ప్రధానంగా పార్టీల నాయకుల పర్యటనలు కొనసాగాయి. ఏమైతేనేమి నాయకుల పార్టీల నాయకుల పర్యటనలు, బొగ్గు గనుల పర్యటనలు, కార్మికుల పలకరింపులు, సమస్యలు వినిపించడం, ప్రభుత్వ టార్గెట్ గా కోల్ బెల్ట్ యుద్ధరీతిని తలపిస్తున్నాదని రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. యిదే సమయంలో సింగరేణి అధికారులు సైతం తమ సనస్యలపై గొంతు పెంచారు. మూడేళ్లుగా పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పిఆర్పి) బకాయిలు చెల్లించాలంటూ దాదాపు రెండు వేల పైగా అధికారులు తమ సంఘం ఆధ్వర్యంలో ఈ 17 నుండి పోరుబాట పట్టారు. తమ బకాయి లతో పాటు పదోన్నతులు, సింగరేణికి ప్రభుత్వం నుండి రావల్సిన బకాయిలు ఇలా మరి కొన్ని సమస్యల పై ర్యాలీలు, కార్యాలయాల ముందు ధర్నా లాంటి పోరాటలకు పూనుకున్నారు. ఏమైనా సింగరేణి ప్రభావిత జిల్లాలు, మండుతున్న ఎండల్లాగా సమస్యలు, రాజకీయాలతో మంటలు చిమ్ముతున్నాయానేది వాస్తవం.

# అగ్రహారం శ్రీ జోడాంజనేయ స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్



రాజన్న సిరిసిల్ల ,జూన్20(మనం ప్రతినిధి ):వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం శ్రీ జోడాంజనేయ స్వామివారిని శనివారం రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఆలయ అర్చకులు విప్ కు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



నెన్నెల, జూన్ 20 (మనం న్యూస్): నెన్నెల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ 3వ వార్డు సభ్యురాలు తాళ్లపల్లి రాజుబాయి--రాజం దంపతుల పెద్ద కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు తాళ్లపల్లి లింగన్న వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసిన దుర్గం చిన్నయ్య, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గడ్డం భీమా గౌడ్, నెన్నెల సర్పంచ్ ఎం.డి. ఇబ్రహీం, మాజీ ఉపసర్పంచ్ గడ్డం స్వామి గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పుదరి అంజన్న, దుర్గం కృష్ణస్వామి, దుర్గం దేవయ్య, తాళ్లపల్లి ప్రవీణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మైలారంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు వేగవంతం



నెన్నెల, జూన్ 20 (మనం న్యూస్): నెన్నెల మండలంలోని మైలారం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో విద్యుత్ స్తంభాలు దెబ్బతిని విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి, ఏఈ రాజన్న, సబ్ ఇంజనీర్ పవన్ ఆధ్వర్యంలో శనివారం మరమ్మతు పనులు చేపట్టారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు, తెగిపోయిన విద్యుత్ తీగలను సరిచేసే పనులను యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తున్నారు. గ్రామ సర్పంచ్ సుమలత ప్రేమ్ సాగర్ గౌడ్, ఉపసర్పంచ్ హరీష్ సహకారంతో విద్యుత్ శాఖ అధికారులు పరిస్థితిని పరిశీలించి, విద్యుత్ సరఫరా త్వరగా పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పనులు పూర్తయిన వెంటనే గ్రామానికి విద్యుత్ సరఫరా అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మరమ్మతు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ తీగలకు దూరంగా ఉండి భద్రతా సూచనలు పాటించాలని సూచించారు. గ్రామ ప్రజల సహకారంతో విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.